


# చైతన్యరథం


సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు






## ఏపీ హైకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

- వివరాలు 5 లో..



## విశాఖ రైల్వేజోన్‌పై గెజిట్

### ఉత్తరాంధ్ర వాసుల కల సాకారం

ఉత్తరాంధ్ర వాసుల చిరకాల కోరిక అతిత్వరలోనే సాకారం కానుంది. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2026 జూన్ 1నుంచి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని గెజిట్‌లో పేర్కొంది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ జోన్ పరిధిలోకి తీసుకొచ్చింది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వేనుంచి కొన్ని ప్రాంతాలను కలిపి దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు చేస్తున్నట్టు గెజిట్‌లో కేంద్రం పేర్కొంది.

3



దక్షిణ రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట సంబరాలు

## రాష్ట్రంలో పెట్టుబడుల స్వర్ణయుగం

- ఏపీకి ప్రతిష్టాత్మక సంస్థ క్యారియర్
- శ్రీసిటీలో నేడు మంత్రి లోకేష్ శంకుస్థాపన
- రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాల కల్పన

3

ప్రజాప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడుల స్వర్ణయుగం నడుస్తోంది. దార్శనిక నేత చంద్రబాబునాయుడు, విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషితో ఏపీకి పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. గత 22 నెలల కాలంలో రాష్ట్రానికి 800 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి మరో ప్రతిష్టాత్మక సంస్థ వచ్చింది. అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ రాష్ట్రంలో తన ఉత్పత్తి సంస్థను ప్రారంభించనుంది. నేడు శ్రీ సిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.



## రాష్ట్రానికి తరగని ఆస్తిగా ఇనుప ఖనిజం నిల్వలు



- రూ.1.90 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.52 లక్షల ఉద్యోగాలకు అవకాశం
- సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేయండి
- గనుల శాఖ సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- 2025-26లో లక్ష్యాన్ని మించిన మైనింగ్ రెవెన్యూ
- 2026-27లో రూ.4,650 కోట్ల ఆదాయార్జన లక్ష్యం

2



## ప్రజా హృదయాలు గెలవండి.. మళ్లీ మళ్లీ మనల్ని గెలిపిస్తారు!

- అభివృద్ధి, సంక్షేమం జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత క్యాడర్‌దే
- పనిచేయని వారి పదవులు ఊడతాయని అధినేత హెచ్చరించారు
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం
- టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో నారా లోకేష్
- కాఫీ కబుర్లు సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిశానిర్దేశం

4



## నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

2

2026-27 ఏడాదికి రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళిక

## మహానాడు ప్రాంగణం ఖరారు

- కోవూరు ఇఫ్కో సెజ్ ఎంపిక
- నేటి నుంచి వేదిక పనుల ప్రారంభం
- చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తాం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

5





## వెలిగొండ పనులను పూర్తిచేయాలి

- చిక్కుకుపోయిన టీబీఎం మెషిన్ తొలగించాలి
- త్వరలోనే నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ బిల్లులు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

8

# రాష్ట్రానికి తరగని ఆస్తిగా
# ఇనుప ఖనిజం నిల్వలు

- రూ.1.90 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.52 లక్షల ఉద్యోగాలకు అవకాశం
- సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేయండి
- గనుల శాఖ సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- 2025-26లో లక్ష్యాన్ని మించిన మైనింగ్ రెవెన్యూ
- 2026-27లో రూ.4,650 కోట్ల ఆదాయార్జన లక్ష్యం



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని ఇనుప ఖనిజ నిల్వలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని... అటు ఆదాయం, ఇటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. గనుల శాఖపై క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఏపీఎండీసీ వైస్ చైర్మన్, ఎండీ ప్రవీణ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సుమారు 1,938 మిలియన్ టన్నుల వరకు ఐరన్ ఓర్ నిల్వలు కలిగి ఉండటంతో అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉందని సమీక్షలో సీఎం స్పష్టం చేశారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా సంస్థ 17.8 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తుండగా, రాయలసీమలో జేఎస్‌డబ్ల్యు సంస్థ కూడా భారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని సీఎం అన్నారు. 2035నాటికి వీటి సామర్థ్యం ఏడాదికి 20 మెట్రిక్ టన్నులకు పైగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం పెంచే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలోని మొత్తం 17 ఐరన్ ఓర్ బ్లాకులకుగాను... ఇప్పటికే కేటాయించినవి మినహా, మిగిలిన బ్లాకులను వివిధ సంస్థలకు కేటాయించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. 2030నాటికి ఏడాదికి 30 మెట్రిక్ టన్నులు, 2035నాటికి ఏడాదికి 113 మె.ట. ఇనుప ఖనిజం ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో ఐరన్ ఓర్ వినియోగం 4 రెట్లు పెరిగే అవకాశం ఉందని, రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇనుప ఖనిజం లభ్యత అద్భుత అవకాశంగా చెప్పారు. ఈ రంగంలో రూ.1.9 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.52 లక్షల ఉద్యోగాలు సృష్టి జరుగుతుందని సీఎం అన్నారు. అలాగే, తక్కువ గ్రేడ్ మాగ్నటైట్ ఖనిజాన్ని ప్రాసెస్ చేయడానికి ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్దేశించారు. ఖనిజాల అన్వేషణ వేగంగా చేపట్టడంతో పాటు, లీజుల అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేలా అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.

### 2026-27లో 36 శాతం ఆదాయ వృద్ధి లక్ష్యం

2025-26లో లక్ష్యాన్ని మించి గనుల శాఖలో 108 శాతం ఆదాయాన్ని ఆర్జించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గనులశాఖ రూ.3,416 కోట్లు ఆదాయం సాధించింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 32 శాతం ఎక్కువ. ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి ప్రధాన ఖనిజ రాష్ట్రాలకంటే ఇది అత్యధిక వృద్ధి. 2026-27 సంవత్సరానికి గత ఏడాది కంటే 36 శాతం అధికంగా రూ.4,650 కోట్ల లక్ష్యాన్ని సమీక్షలో నిర్ణయించారు. గనుల శాఖలో ఆదాయం పెంచేందుకు మైనింగ్ లీజుల ఆపరేషనలైజేషన్, లైమ్ స్టోన్ ఉత్పత్తి పెంపు, కొత్త లీజుల మంజూరువంటి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

# నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

## 2026-27 ఏడాదికి రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళిక



అమరావతి (చైతన్య రథం): నాబార్డు క్రెడిట్ ప్లాన్ స్టేట్ ఫోకస్ పేపర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. 2026-27 సంవత్సరానికిగాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో నాబార్డు అంచనాలు రూపొందించింది. రుణ ప్రణాళిక గత ఏడాది రూ.4.24 లక్షల కోట్లుండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాథమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది. హార్టికల్చర్‌లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. అలాగే ఎంఎస్ఎంఈలకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

### హార్టీకల్చర్‌కు అండగా నిలవండి..

నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా ఉండాలని బ్యాంకులు, నాబార్డ్ ప్రతినిధులను సీఎం కోరారు. ఈ సందర్భంగా హార్టికల్చర్‌లో ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఏడాదికి 450 లక్షల మెట్రికల్ టన్నుల హార్టీకల్చర్ ఉత్పత్తులు రాష్ట్రం సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో వ్యవసాయం అందులోనూ... హార్టీకల్చర్, ఆక్వాకల్చర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. దీనికి అవసరమైన పూర్తి సహకారాన్ని బ్యాంకులు, నాబార్డ్ అందించాలని సీఎం కోరారు. కార్యక్రమంలో నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, జీఎం కెవిఎస్ ప్రసాద్, కెనారా, ఎస్బీఐ, ఎస్ఎల్‌బిసి, ఏపీజీబీ, ఏపీసీవోబీ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



### దక్షిణ కోస్తా రైల్వేజోన్‌తో

# ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధి


**- ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు**



అమరావతి (చైతన్య రథం): విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వేశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. "ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. 2026 జూన్ 1నుంచి విశాఖ కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుంది. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి దోహదపడుతుంది. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నా"అని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్టు చేశారు.

## ఏపీ గ్రోత్‌కు జోన్ కీలకం
## గెజిట్ జారీపట్ల ధన్యవాదాలు తెలిపిన లోకేష్

అమరావతి (చైతన్య రథం): విశాఖపట్నాన్ని ప్రధాన కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్.. ఏపీ కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధికి కీలక ఘట్టంగా విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అభివర్ణించారు. ఈమేరకు ఎక్స్ పోస్టులో.. "ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ దార్శనిక నాయకత్వంలో చారిత్రాత్మక నోటిఫికేషన్ జారీ చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ చర్య ఆంధ్రప్రదేశ్ రైల్వే మౌలిక సదుపాయాలను, కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుంది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న ఒక ఆకాంక్ష ఇప్పుడు నెరవేరినందుకు చాలా సంతోషిస్తున్నా. ఈ మైలురాయి ప్రాంతీయాభివృద్ధికి ఊతమిస్తుంది. కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది. మన ప్రజలకు కొత్త అవకాశాలను అందిస్తుంది. దీనిని సాకారం చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.



## నిర్మాత ఆర్బీ చౌదరి మరణంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**చౌదరి కుటుంబానికి సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి**

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ చిత్ర నిర్మాత, సూపర్ గుడ్ ఫిలిమ్స్ అధినేత ఆర్బీ చౌదరి మరణంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జోధ్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌదరి మరణించడం బాధాకరమన్నారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో 90కి పైగా చిత్రాలను నిర్మించిన చౌదరి ఎంతోమంది నటీనటులకు అవకాశాలను అందించారని ముఖ్యమంత్రి చెప్పారు. ఆర్బీ చౌదరి మరణం చిత్రసీమకు తీరని లోటన్నారు. చౌదరి ఆత్మకు శాంతి కలగాలని సీఎం ప్రార్థించారు. చౌదరి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నిర్మాత మృతిపట్ల లోకేష్ నివాళి

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం చాలా బాధాకరమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్ పోస్టులో.. "ఆర్బీ చౌదరి దివ్యస్మృతికి నివాళి అర్పిస్తున్నా. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెలుగు, తమిళ భాషల్లో విజయవంతమైన చిత్రాలు తీసి ప్రేక్షకులను అలరించిన చౌదరి మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అని పేర్కొన్నారు.


# విశాఖ రైల్వేజోన్‌పై గెజిట్ జారీ

డిల్లీ (చైతన్య రథం): ఉత్తరాంధ్ర వాసుల చిరకాల కోరిక అతిత్వరలోనే సాకారం కానుంది. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2026 జూన్ 1నుంచి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని గెజిట్‌లో పేర్కొంది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ జోన్ పరిధిలోకి తీసుకొచ్చింది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వేనుంచి కొన్ని ప్రాంతాలను కలిపి దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు చేస్తున్నట్టు గెజిట్‌లో కేంద్రం పేర్కొంది. రాయగడనుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్‌లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది.

తాజా ఉత్తర్వులతో రాయగడ డివిజన్‌లో ఇంతకుముందున్న పలాస-ఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం-దువ్వాడ- విజయనగరం రైల్వే లైన్లు విశాఖ డివిజన్‌లో చేరాయి. అదే విధంగా నౌపడా-పర్లాకిమిడి- బొబ్బిలి - సాలూరు లైన్లు, సింహాచలం-వడ్లపూడి- విశాఖ జగ్గయ్యపాలెం రైల్వే లైన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేశారు. కోరాపుట్- కిరండోల్ లైన్‌ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించారు.

ఆరిలోవలో దక్షిణ కోస్తా రైల్వే శాశ్వత కార్యాలయ నిర్మాణం చేపట్టనున్నారు. వీఎంఆర్డీఏ డెక్‌లోని రెండు అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్వే జీఎం తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేశారు. జూన్ 1నుంచి కార్యకలాపాలు ప్రారంభించడానికి అధికారులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. 2019 ఫిబ్రవరిలో కేంద్రం ఈ జోన్ ఏర్పాటుపై ప్రకటన చేసింది. తర్వాత అది ముందుకు సాగలేదు. చివరికి 2025 జనవరిలో డీపీఆర్‌కు ఆమోదం తెలిపి అదే నెలలో జోనల్ కార్యాలయం భవన నిర్మాణానికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. తాజాగా కీలకమైన గెజిట్ నోటిఫికేషన్ రావడంతో అధికారిక కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి.

ఈ జోన్ కార్యకలాపాలకు కీలక అధికారుల నియామకం ఇప్పటికే పూర్తయింది. ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారుల నియామకం పూర్తైంది. ఇతర డివిజన్లనుంచి ఆప్షన్లు కోరగా 3వేలమంది విశాఖ జీఎం కార్యాలయం పరిధిలో పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. జీఎం కార్యాలయంలో 1200మంది అవసరం. జోన్ అంతటా 17వేల మంది వరకూ పనిచేస్తారు.




## ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం

**పాలిసెట్ ఫలితాలపై విద్య మంత్రి లోకేష్ వ్యాఖ్య**



అమరావతి (చైతన్య రథం): పాలీ సెట్ పరీక్షల్లో బాల బాలికలు ప్రదర్శించిన అద్భుత ప్రదర్శన -భవిష్యత్ టెక్నోక్రాట్లను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని విద్యా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "ఈ ఏడాది ఏపీ పాలిసెట్‌కు జరిగిన పరీక్షకు రికార్డు స్థాయిలో 1,77,581మంది అభ్యర్థులు నమోదు చేసుకుంటే.. 1,63,008 మంది హాజరయ్యారు. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక భాగస్వామ్యం. వీరిలో 1,48,950 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 91.37శాతం. బాలికలు 93.57శాతం ఉత్తీర్ణత శాతంతో బాలురను అధిగమించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ టెక్నోక్రాట్లుగా, పారిశ్రామికవేత్తలుగా మహిళలను తీర్చిదిద్దాలనే మా నిబద్ధతకు నిదర్శనం. అంతేకాకుండా, మన గిరిజన జిల్లాల అద్భుత ప్రదర్శన కూడా ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తోంది. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు (99.11శాతం), పోలవరం (95.46శాతం), పార్వతీపురం మన్యం (93.45శాతం) జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. విజయం సాధించిన అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు. ఈసారి అవకాశం కోల్పోయినవారు నిరుత్సాహం వద్దు. పట్టుదలతో ఉండండి, కృషి చేస్తూనే ఉండండి, విజయం మిమ్మల్ని వరిస్తుంది" అని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పెట్టుబడుల స్వర్ణయుగం

- **ఏపీకి ప్రతిష్టాత్మక సంస్థ క్యారియర్**
- **శ్రీసిటీలో నేడు మంత్రి లోకేష్ శంకుస్థాపన**
- **రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాల కల్పన**

అమరావతి (చైతన్య రథం): ప్రజాప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడుల స్వర్ణయుగం నడుస్తోంది. దార్శనిక నేత చంద్రబాబునాయుడు, విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషితో ఏపీకి పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. గత 22 నెలల కాలంలో రాష్ట్రానికి 800 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి మరో ప్రతిష్టాత్మక సంస్థ వచ్చింది. అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ రాష్ట్రంలో తన ఉత్పత్తి సంస్థను ప్రారంభించ నుంది. నేడు శ్రీ సిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. దేశంలో క్యారియర్ సంస్థ కార్యకలాపాలు ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నాయి. హర్యానాలోని గుర్‌గ్రామ్‌లో తయారీ యూనిట్, హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను సంస్థ కలిగి ఉంది.

### శ్రీసిటీలో వెయ్యి కోట్ల పెట్టుబడి, 3వేలమందికి పైగా ఉద్యోగాల కల్పన

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం లోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో 39ఎకరాల విస్తీర్ణంలో క్యారియర్ సంస్థ తన నూతన తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. 2028నాటికి మూడు దశల్లో సుమారు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ప్లాంట్ ద్వారా దాదాపు 3వేల మంది కి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నా యి. దేశంలో దీర్ఘకాలిక అభివృద్ధిలో భాగం గా క్యారియర్ సంస్థ శ్రీసిటీలో అత్యాధునిక స్మార్ట్ తయారీ యూనిట్‌ను స్థాపించనుంది. ఈ ప్లాంట్ హెచ్‌వీ ఏసీ, సంబంధిత ఉత్పత్తులపై పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే కాకుండా.. కార్యకలాపాల సామర్థ్యాన్ని, విస్తృతిని పెంచనుంది. ఈ యూనిట్ అత్యాధునిక మౌలిక వసతులు, ఆధునిక ప్లాంట్, మెషినరీతో ఏర్పాటుకానుంది. తద్వారా భవిష్యత్‌కు సిద్ధమైన తయారీ సామర్థ్యాలు, సాంకేతిక సమన్వయం, పోటీ సామర్థ్యం కలిగిన వాతావరణం ఏర్పడుతుంది.





## ప్రజా హృదయాలు గెలవండి..

# మళ్లీ మళ్లీ మనల్ని గెలిపిస్తారు!

- అభివృద్ధి, సంక్షేమం జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత క్యాడర్‌దే
- పనిచేయని వారి పదవులు ఊడతాయని అధినేత హెచ్చరించారు
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం
- టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో నారా లోకేష్
- కాఫీ కబుర్లు సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిశానిర్దేశం



అమరావతి (చైతన్య రథం): మనం చేసిన అభివృద్ధి- సంక్షేమం ప్రజలకు వివరించండి. అహంకారం వీడి సత్ప్రవర్తన, మంచి మాటలతో ప్రజల మనస్సులు గెలవండి. ప్రజలే మనల్ని మళ్లీ మళ్లీ గెలిపిస్తారని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి నివాసంలో టిడిపి క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన కాఫీ కబుర్లు కార్యక్రమంలో నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీ లీడర్లు, క్యాడర్ సమన్వయం చేసుకుంటూ అనునిత్యం ప్రజలతో మమేకం కావడం ముఖ్యం. గత ఎన్నికల్లో గొడ్డలి పార్టీ 151నుంచి 11 సీట్లకు దిగజారడానికి వారి అహంకారమే కారణం. ఎట్టి పరిస్థితుల్లో అహంకారం, దర్పం ప్రదర్శించకుండా ప్రజలతో గౌరవప్రదమైన భాషలో మాట్లాడి వారి మనసులు గెలవండి" అని సూచించారు.

### అభివృద్ధి, సంక్షేమంలో మనమే ఫస్ట్

"ప్రస్తుతం దేశంలో రూ.4వేల పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. తల్లికి వందనం పథకం కింద చదువుకునే పిల్లలందరికీ రూ.15వేల చొప్పున ఇస్తున్న రాష్ట్రం కూడా మనదే. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలను అమలు చేస్తున్నాం. ఆటోడ్రైవర్ల సేవలో, మత్స్యకార భరోసావంటి పథకాలను ఇస్తున్నాం. పోలవరం పూర్తి కావస్తోంది. అభివృద్ధి జోరుగా సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం" అని లోకేష్ పేర్కొన్నారు.

### సానుకూల దృక్పథమే గెలుపు సూత్రం

"నెగిటివ్ ఆలోచనలు వద్దు. సానుకూల దృక్పథంతో పనిచేయడంలో అధినేత చంద్రబాబును ప్రతి ఒక్క కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలి. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. తాజాగా జరిగిన తమిళనాడు ఎన్నికల్లో ఒక్క ఓటుతో గెలిచిన ఎమ్మెల్యే కూడా ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుని క్యాడర్ పనిచేయాలి. పార్టీలో శిక్షణాతరగతులు నిరంతరం కొనసాగుతాయి. ఏడాదిలో 300రోజులపాటు మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు తరగతులు నిర్వహిస్తాం. తెలుగుదేశం పార్టీ ఆరు శాసనాల్లో -కార్యకర్తే అధినేత ఒకటి. చంద్రబాబు వద్ద ఇప్పుడు కోటరీలు లేవు. సామాన్య కార్యకర్త సైతం నేరుగా ఆయనను కలసి సమస్యలు చెప్పుకునే అవకాశముంది. ప్రతివారం అధినేత చంద్రబాబు, నేను కేంద్ర కార్యాలయంలో క్యాడర్‌కు అందుబాటులో ఉంటాం. మై టీడీపీ యాప్‌లో టాప్-10 క్యాడర్‌తో ప్రతి మూడు నెలలకోసారి కలుస్తా. రాజకీయ పార్టీల చరిత్రలో ఇదివరకెన్నడూ లేనివిధంగా మండల పార్టీ అధ్యక్షురాలు, క్లస్టర్ ఇన్‌చార్జిలకు పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించాం. ప్రతి నాయకుడి పనితీరును అధినేత చంద్రబాబు ప్రతి మూడునెలలకోసారి సమీక్షిస్తారు. పనిచేయకపోతే పదవులు పోతాయని నిర్మొహమాటంగా మాతో చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అందరూ పనిచేయాలి" అది లోకేష్ దిశానిర్దేశం చేశారు.

### టీడీపీలో వ్యక్తులు కాదు... పార్టీ శాశ్వతం

"తెలుగుదేశంలో వ్యక్తులు శాశ్వతం కాదు. పార్టీ శాశ్వతం. పార్టీలో ఈరోజు నాకు ఎవరితో విభేదాలు లేవు. సమస్య ఉన్నవారిని పిలిచి వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కరిస్తున్నా. ఏవైనా సమస్యలుంటే అంతర్గత వేదికలపై మాట్లాడి పరిష్కరించుకోవాలి. ప్రజల్లో పార్టీ ఇమేజ్ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 నియోజకవర్గాల్లో పర్యటించి, కార్యకర్తలను కలుసుకున్నా. 2027లోగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తా. పార్టీ కేడర్‌పై పెట్టిన 80శాతం అక్రమ కేసులు ఇప్పటికే తొలగించాం. మిగిలినవి కూడా తీసేస్తాం. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తాం. వివిధ కారణాలతో నాయకత్వంపై అలిగి ఇంట్లో పడుకోవడంవల్ల అంతిమంగా పార్టీ నష్టపోతుంది" అని స్పష్టం చేశారు.

### పనిచేసేవారికి సముచిత స్థానం

"పార్టీ అధినేత చంద్రబాబు, నేను పర్యటనలకు మా సొంత వాహనాలు వినియోగిస్తున్నాం. వ్యక్తిగత విదేశీ పర్యటనలు మా సొమ్ముతోనే వెళ్తున్నాం. మేం జవాబుదారీగా ఉంటున్నాం. కానీ ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారి ఫేక్ ప్రచారాన్ని మనం వాస్తవ సమాచారంతో వెంటనే తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియనంతగా ఫేక్ ప్రచారం జరుగుతున్న సమయంలో ప్రతి కార్యకర్త అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కార్యకర్తలు వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినపుడు గౌరవంగా వ్యవహరించాలని ఆదేశాలిస్తాం. దీర్ఘకాలంగా అధికారంలో కొనసాగేందుకు బిజెపి అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేస్తున్నాం. మన పార్టీలో మై టీడీపీ యాప్ మాదిరిగానే బిజెపిలో సరళ్ యాప్ ఉంది. కేంద్రమంత్రి నుంచి సామాన్య కార్యకర్త వరకూ వారు చేసే రోజువారీ పనిని అందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పనిచేసే ప్రతీ ఒక్కరినీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తాం" అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేష్ భరోసా ఇచ్చారు.







# మహానాడు ప్రాంగణం ఖరారు

- కోవూరు ఇఫ్కో సెజ్ ఎంపిక
- నేడు వేదిక పనులకు శంకుస్థాపన
- చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తాం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





నెల్లూరు (చైతన్యరథం): ఈనెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరు జిల్లా కోవూరు వేదికగా ప్రతిష్టాత్మకంగా జరగబోయే మహానాడు ప్రాంగణాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ఇఫ్కో సెజ్‌లో స్థల పరిశీలన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మహానా డు వేదిక స్థలాన్ని ఎంపిక చేయడం పూర్తయిందని తెలిపారు. స్థలం విషయంలో కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి సభ్యులు వచ్చి పరిశీలించి ఫైనల్ చేసినట్లు చెప్పారు. అలాగే స్థలం విషయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు దగ్గర నుంచి అనుమతులు వచ్చాయని వివరించారు. మహానాడు మూడురోజులు ఇక్కడే నిర్వ హించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహానాడు వేదిక పనుల కు బుధవారం ఉదయం ముహూర్తం ప్రకారం శంకుస్థాపన కార్య క్రమం జరుగుతుందని వివరించారు. మహానాడు కార్యక్ర మాలను పరిశీలించడానికి బుధవారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, శాసనసభ్యులు ప్రశాంతి, వక్ఫ్ బోర్డు చైర్మన్, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి స్థలాన్ని పరిశీలించడం జరిగిందని వివరించారు.

మహానాడుకు సంబంధించిన ప్లానింగ్ అంతా ఇప్ప టికే పూర్తయింది. మూడురోజులు చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ మహానాడు ప్రాంగణంలోనే బస చేస్తారని వివరించారు. 44 ఏళ్ల తెలుగుదేశం పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారిగా నెల్లూరు జిల్లా లో మహానాడు నిర్వహించడం జరుగుతుంది. దానిని దృష్టిలో పెట్టుకుని చరిత్రలో నిలిచిపోయేలాగా మహానాడు నిర్వ హించబో తున్నామని తెలిపారు. ఈ మహానాడుతో నెల్లూరు జిల్లా ముఖ చిత్రం మారబోతుందని విశ్వసనీయంగా నమ్ముతున్నా. మహా నాడును ఒక పండుగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.






# ఏపీ హైకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజి యం నిర్ణయించింది. అందుకు సంబంధించిన సిఫార్సులను న్యాయశాఖకు సుప్రీంకోర్టు కొలీజియం పంపింది. ఈ సిఫార్సు లను ఆమోదం కోసం రాష్ట్రపతి వద్దకు న్యాయశాఖ పంపింది. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలుపుతూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముగ్గురు జ్యుడీషియల్ అధికారు లను న్యాయ మూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తాజాగా నిర్ణయం తీసుకుంది. న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, సి. హెచ్.పురుషోత్తమ కుమార్‌లను నియమించాలని నిర్ణయించింది. దాంతో ప్రస్తుతం జ్యుడీషియల్ అధికారుల కేడర్ లో ఉన్న ఈ ముగ్గురిని హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమోషన్ కల్పించనున్నట్లు అయింది. వీరి నియామకంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరగనుంది.

# తెనాలిలో వైసీపీ నేతల దౌర్జన్యం

- భూదందా..తప్పుడు పత్రాలతో ఖాతాల సృష్టి
- పట్లవీడులో భూ రికార్డుల మాయం
- వారసత్వ భూమి అక్రమంగా ఆన్‌లైన్
- చిన్నమండెంలో వీఆర్వో లీలలు..
- బావమరిది కోసం రికార్డులే మార్చేశాడు
- ప్రజావినతుల్లో ఫిర్యాదుల పరంపర
- అర్జీలు స్వీకరించిన మంత్రి టీజీ భరత్





మంగళగిరి(చైతన్యరథం): గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పిల్లి స్వాతి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వైసీపీ నేతల అరాచకాలపై ఫిర్యాదు చేశారు. ప్రియాంక డ్వాక్రా గ్రూపులో సభ్యురాలైన తాను గ్రూపు లీడర్లు, ఆర్‌పీల అవినీతిని ప్రశ్నించి నందుకు 2023 మే నెలలో వైసీపీ నేతలు గెడ్డేటి సురేంద్ర, గెడ్డేటి ఝాన్సీ అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో తన మెడలోని 30 గ్రాముల బంగారు తాళిబొట్టు గొలుసును దౌర్జన్యంగా లాక్కున్నారు. దీనిపై తెనాలి 2వ పట్టణ స్టేషన్‌లో కేసు నమోదైనా రాజకీయ ఒత్తిళ్లతో ప్రధాన నిందితుల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారు. న్యాయం చేయాల్సిన పోలీసులే నిందితు లతో కుమ్మక్కై తనపైనే కౌంటర్ కేసు నమోదు చేశారు. నిందితులు తన ఇంటిపై ఇటుక రాళ్లతో దాడి చేసి, బీరువాలోని లక్ష రూపాయల నగదును తీసుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. పైగా తననే నిందితురాలిగా చూపిస్తూ కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. మంత్రి టీజీ భరత్ గుప్తా, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నెం ధర్మవరం సుబ్బారెడ్డి అర్జీలు స్వీకరించారు.

## తప్పుడు పత్రాలతో వైసీపీ నేతల భూ ఖాతాలు

అన్నమయ్య జిల్లా పుంగనూరు మండలం మంగళం గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు ఎ.విశ్వేశ్వరరెడ్డి, ఎ. జ్యోస్న అనే వ్యక్తులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు పత్రాల ద్వారా అక్రమంగా భూ ఖాతాలను సృష్టించుకున్నారు. ఎ. విశ్వేశ్వరరెడ్డి పేరుతో ఖాతా నంబరు 939, ఖాతా నంబరు 1386లలో నిబంధనలకు విరుద్ధంగా భూమిని నమోదు చేసుకున్నారు. వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

## అక్రమంగా భూమి ఆన్‌లైన్ చేసుకున్నారు

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శివశంకర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ పట్లవీడు గ్రామంలో సర్వే నంబర్ 1152లో తమకు 1.90 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 0.37 సెంట్లను ఉప్పలపాడు గ్రామానికి చెందిన బైరెడ్డి వెంకటరెడ్డి అక్రమంగా ఆన్‌లైన్ చేయిం చుకున్నాడు. స్థానిక వీఆర్వో కుందు సత్యనారాయణ డబ్బు తీసుకుని రికార్డులను మార్చారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తాను భూమి కొనుగోలు చేసి చాలా ఏళ్లు అవుతున్నా రెవెన్యూ రికార్డుల్లో తన పేరు నమోదు కాలేదని అన్నమయ్య జిల్లా చిన్నమండెంకు చెందిన వెంకటరమణ వినతిపత్రం ఇచ్చారు. సర్వే నంబర్లు 0444, 253/1, 262/5 (0.72 ఎకరాలు), 262/6లో 1.70 ఎకరాల భూమి ఉంది. వీఆర్వో రియాజ్ బాషా లంచాలు తీసుకుని తన భూమిని తన చెల్లెలి భర్త బురాన్ ఖాన్ పేరు మీద ఆన్‌లైన్ చేసినట్లు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలోని సర్వే నంబర్ 105/2లో తమకు 1.59 ఎకరాల భూమి ఉంది. తాము రాజమండ్రికి వలస వెళ్లి అక్కడ నివసిస్తున్నాం. దీనిని ఆసరాగా చేసుకుని తంగిరాలపల్లి గ్రామానికి చెందిన లింగాల అబ్రహం అక్రమంగా ఆన్‌లైన్ చేయించు కున్నాడు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## కోర్టు తీర్పు ఉన్నా పట్టా ఇవ్వలేదు

అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన వెంకటరమణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ 1985లో జిల్లా దళిత డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా మోటకట్ల రెవెన్యూ పరిధిలో 108 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 3 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. తనకు సర్వే నెం.1030లో 1.20 ఎకరాల భూమి లభించింది. 2016లో పట్టా ప్రపోజల్స్ కూడా సిద్ధమ య్యాయి. 2019లో ప్రభుత్వం మారాక స్థానిక రెవెన్యూ అధికా రులకు తెలియకుండానే రాయచోటి ఆర్డీవో ఆఫీసులో ఫైళ్లను తారుమారు చేశారు. తనకి రావాల్సిన 1.20 ఎకరాలను 0.70 సెంట్లకు తగ్గించి మిగిలిన 0.50 సెంట్లను రాజకీయ పలుకు బడి కలిగిన జె.మురళీకృష్ణ పేరు మీద ప్రపోజల్స్ పంపారు. దీనిపై రాయచోటి కోర్టును ఆశ్రయించగా తహశీల్దారు ఇచ్చిన సాక్ష్యాధారాల ప్రకారం ఆ భూమి తమదేనని స్పష్టం చేసింది. సర్వే నెం.1030 లోని పూర్తి 1.20 ఎకరాల భూమికి పట్టా ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. అయినా ప్రత్యర్థి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తనని వేధిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను

చైతన్యరథం

# విశాఖ సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌తో

# ఉత్తరాంధ్ర వాసుల కలల సాకారం

- సీఎం చంద్రబాబు కృషితో గెజిట్ విడుదల
- జూన్ 1 నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



విశాఖపట్నం(చైతన్యరథం): ఉత్తరాంధ్ర ఆశయాలు, పోరాటాలు, కలలకు విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు గెజిట్ నోటిఫికేష న్‌తో న్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అనేక మంది నాయకులు చేసిన పోరాట పటిమకు పట్టం కట్టిన ట్లుగా విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. ఉత్తరాంధ్ర వాసుల చిరకాల వాంఛ నెరవేరడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర కృషి, దూరదృష్టి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఉన్న హామీని కార్యరూపం దాల్చే దిశగా చంద్రబాబు నిరంతరం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో ప్రధాన అజెం డాగా నిలిపారని తెలిపారు. 2014-19 కాలంలో టీడీపీ ఎంపీలు పార్లమెంటు లోపల, బయట "విశాఖ రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు" అంటూ గళమెత్తిన పోరాట ఫలితమే ఈరోజు రైల్వేజోన్ ఫలితమని పేర్కొన్నారు. 2019లో జోన్ ప్రకటించినప్పటికీ తరువాతి కాలం లో పనులు మందగించడం, ముఖ్యంగా 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ప్రాజెక్టు నిలిచిపోవడం బాధాకరమని విమర్శించారు. భూసేకరణ వంటి



కీలక అంశాల్లో ఆలస్యం చేయడం వల్లే ప్రాజెక్టు ముందుకు సాగలేదని పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖతో చర్చలు జరిపి ప్రక్రియను వేగవంతం చేశారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి పరిపాలనాపరమైన అడ్డంకులను తొలగించి రైల్వే జోన్ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారని చెప్పారు. చంద్రబాబు విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించి పరిపాలన అనుమతులను వేగవంతం చేయ డంతో 2026 మే 4న గెజిట్ విడుదల కావడం సాధ్యమైందని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించబోతుందని తెలి పారు. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లు ఈ జోన్ పరిధిలోకి రావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు స్వంత రైల్వే జోన్ లభించిందని చెప్పారు. రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని, కొత్త రైలు మార్గాలు, స్టేషన్ల ఆధునికీకరణ, పరిశ్రమల అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నం దేశంలోనే కీలక రైల్వే హబ్‌గా ఎదిగే దిశగా ఈ నిర్ణయం మైలురాయిగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

## సీఎం చంద్రబాబు కృషితోనే రైల్వేజోన్

***- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి***



అమరావతి (చైతన్యరథం): విశాఖ రైల్వే జోన్‌కు కేంద్ర ప్రభు త్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదలతో ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమైందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు కృషి, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం వల్లే ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలయిన విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. కేంద్ర, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వంతో డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధిలో బుల్లెట్ ట్రైన్‌లా దూసుకుపోతుందని వ్యాఖ్యానించారు.

## ఏపీ ప్రజల చిరకాల స్వప్నం సాకారం

**- మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి**



అమరావతి (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం దక్షిణ కోస్తా రైల్వే పరిధిని స్పష్టం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాను కూల నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కావడం ఏపీ ప్రజల చిరకాల స్వప్నం..సీఎం చంద్రబాబు కృషితోనే ఇది సాకారమైందని తెలిపారు. కొత్త జోన్ ఏర్పాటుతో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదు పాయాలు, కొత్త రైళ్ల రాక, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉత్తరాంధ్ర అభివృద్ధిలో చారిత్రాత్మక ఘట్టం

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి(చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం ఆంధ్రుల విజయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చందబాబు అకుంఠిత దీక్షకు లభించిన ఫలితం దక్షిణ తీర రైల్వే జోన్. 2014 విభజన చట్టంలోని హామీని సాధించేందుకు చంద్రబాబు నాటి నుంచి నేటి వరకు కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తెచ్చారు. టీడీపీ ఎంపీల సుదీర్ఘ పోరాటం వల్లే 2019లో జోన్ ప్రకటన రాగా, నేడు గెజిట్ విడుదలై కార్యరూపం దాల్చింది. ఉత్తరాంధ్రపై, విశాఖ రైల్వే జోన్‌పై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిం దన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన అడ్డంకులను తొలగించి విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. చంద్రబాబు చొరవతో గత 22 నెలల్లోనే దాదాపు రూ.19,000 కోట్లు రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రూ.19 వేల కోట్ల నిధులు సాధించడంతో పాటు గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలను ఉత్తరాంధ్రకు తెచ్చిన ఘనత చంద్రబాబు, లోకేష్ లది. విశాఖను గ్లోబల్ హబ్‌గా చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారు. రైల్వే జోన్ ఏర్పాటుతో స్థానిక యువతకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైల్వే తయారీ యూనిట్లు, స్టేషన్ల ఆధునీకరణతో విశాఖ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు.

## హెల్మెట్ ప్రాణరక్షణకు కవచం

- సురక్షిత రోడ్లతో సురక్షిత జీవితం
- హోంమంత్రి వంగలపూడి అనిత
- నక్కపల్లిలో భారీ బైక్ ర్యాలీ ప్రారంభం



నక్కపల్లి(చైతన్యరథం): రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నియోజకవర్గంలో భారీ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఉదయం ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం ఫ్లైఓవర్ (అడ్డురోడ్డు) వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగింది. "సురక్షిత రోడ్లు - సురక్షిత జీవితం" అనే నినాదంతో సాగిన ఈ ర్యాలీలో మంత్రి స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ యువత, పోలీసు సిబ్బందిని ఉత్సాహపరిచారు. వాహనదారులకు స్వయంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ ప్రాణం వెలకట్ట లేనిది.. రెండు లక్షల రూపాయలు పెట్టి బైక్ కొనే వారు తమ ప్రాణాన్ని కాపాడే వెయ్యి రూపాయల హెల్మెట్‌ను కొనేందుకు వెనుకాడుతున్నారు. ప్రాణం కన్నా ఏదీ ఎక్కువ కాదు. మీరు లేకుండా మీ కుటుంబం రోడ్డున పడకూడదంటే హెల్మెట్ ధరించడం తప్పనిసరని చెప్పారు. పాయకరావుపేట నియోజక వర్గంలో ఎవరైనా సరే హెల్మెట్ ధరించాల్సిందన్నారు. రాజకీయ నాయకులు హెల్మెట్ లేకుండా కనిపిస్తే వారికి రెట్టింపు జరి మానా విధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిబం ధనల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని చెప్పారు. ఇటీవల కాలంలో పాయకరావుపేట నియోజక వర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేక ప్రాణాలు పోవడం బాధాకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే వీటిని అరికట్టగల మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, పాయకరావుపేట ఇన్స్పెక్టర్ శంకర్రావు, నక్కపల్లి సర్కిల్ సీఐ రామకృష్ణ, నక్కపల్లి ఇన్‌స్పెక్టర్ మురళి, స్థానిక ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, నియోజకవర్గ ప్రజా ప్రతి నిధులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

చైతన్యరథం

# ప్లేస్ మీరు చెప్పినా..నన్ను చెప్పమన్నా..

## కూటమి అభివృద్ధిపై చర్చకు రెడీ

- మీటరు రోడ్డు కూడా వేయలేని అసమర్థులు
- ఉన్న పరిశ్రమలనే రాష్ట్రం నుంచి తరిమేశారు
- వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్
- రోడ్డేసిన తరవాతే బూచేపల్లికి వచ్చానని వెల్లడి
- పుట్టపర్తిలో యుద్ధ విమానాల పరిశ్రమపై హర్షం
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



గోరంట్ల/శ్రీసత్యసాయి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై నేను చర్చకు సిద్ధం.. ప్లేస్ మీరు చెప్పినా.. నన్ను చెప్పమన్నా సిద్ధమని అని వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసేందేమీ లేదు.. ఆయనదంతా చోరీ క్రెడిట్, తమది అభివృద్ధి క్రెడిట్ అని వ్యాఖ్యా నించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం రూ.60 లక్షల తో కరావులపల్లి నుంచి కరావులపల్లి తండా వరకు నిర్మించిన బీటీ రోడ్డు, రూ.2.47 కోట్లతో బూచేపల్లి నుంచి కొత్తపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డును జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. గత ఎన్నికల్లో తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బూచేపల్లి గ్రామస్తులు తన దృష్టి తీసుకొచ్చారని గుర్తు చేశారు. రోడ్డేసిన తరవాత బూచేపల్లికి వస్తాయని స్పష్టం చేశా. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ రూ.2.50 కోట్లతో బూచేపల్లికి బీటీ రోడ్డు నిర్మించాం. బూచేపల్లి పంచాయతీలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నా యని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలల కాలంలో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. పెనుకొండ, పులివెందుల, ధర్మవరంలో అభివృద్ధి గురించి తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. గతంలో వలస పక్షుల పాలనలో పెనుకొండ నియోజక వర్గంలో అభివృద్ధి జాడే లేదు..మీటరు రోడ్డు కూడా వేయలేదన్నా రు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి జగన్‌రెడ్డి చేసిందేమీ లేదు. పరిశ్రమలను తరిమేసిన ఘనత ఆయనది. రాష్ట్రానికి ఏమి చేశా రని క్రెడిట్ చోరీకి పాల్పడ డానికి అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డిది అంతా చోరీ క్రెడిట్, ఆ క్రెడిట్ తమకు అక్కర్లేదని అన్నారు. ఆయన హయాంలో ఏయే ఒప్పందాలు జరిగాయో వివరించాలని లోకేష్ అడిగితే వైసీపీ నేతలు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్ర మను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పనున్నట్లు తెలిపారు. యుద్ధ విమా నాల తయారీ పరిశ్రమ రాకతో వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నా యన్నారు. ఈ ప్రాంతం రూపు రేఖలే మారిపోను న్నాయని తెలిపారు.

## ఆటో ప్రమాద మహిళలకు ‘108’ ఆపన్నహస్తం

- బాధితులకు అంబులెన్స్‌లోనే ప్రథమ చికిత్స
- సకాలంలో ఆసుపత్రికి..తప్పిన ప్రాణాపాయం



భీమడోలు(చైతన్యరథం): ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంలా నిలుస్తూ ఆపదలో ఉన్న వారికి అభయమిస్తున్న ‘108’ అత్యవసర సేవలు మరోసారి తమ ప్రాధాన్యతను చాటుకున్నాయి. ప్రమాదం జరిగిన నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు వైద్య సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నాయి. ద్వారకా తిరుమల మండలం ఐయన్ గోపాలపురం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు భీమడోలులోని ఒక శుభకార్యానికి హాజరై తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యం లో భీమడోలు సమీపంలోని కొవ్వూరు రోడ్డు వద్ద ఆటో ప్రమాదవ శాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గౌరిపర్తి రమాదేవి, వడ్లమూడి గోపమ్మ, రాజులపాటి గంగమ్మ, ముల్లుల ప్రసన్న, టి.వెంకటలక్ష్మి, యార్లగడ్డ మహాలక్ష్మి సహా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే ‘108’ అత్యవసర వాహనం ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఘటనా స్థలానికి చేరుకుంది. సిబ్బంది క్షతగాత్రులకు వాహనంలోనే ప్రాథమిక చికిత్స అందించి రక్తస్రావం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ‘గోల్డెన్ అవర్’లో స్పందించి ఆసుపత్రికి చేర్చడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బాధితుల కుటుంబసభ్యులు, స్థానికులు ‘108’ సేవలు కొండం త అండగా నిలిచాయని కృతజ్ఞతలు తెలిపారు.

### ‘108’లో గర్భిణికి సురక్షిత ప్రసవం

అన్నమయ్య జిల్లా రాయచోటి డివిజన్ పరిధిలో ‘108’ అత్యవసర సేవల సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక మహిళకు అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తల్లీబిడ్డలను కాపాడి తమ మానవత్వాన్ని చాటుకు న్నారు. చిన్నమండెం ప్రాంతానికి చెందిన ఇ.అనిత (32) అనే గర్భిణీకి మంగళవారం తెల్లవారుజామున తీవ్ర పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ‘108’కు సమాచారం అందించా రు. సమాచారం అందిన వెంటనే చింతపర్తి (రాయచోటి డివిజన్)కి చెందిన అంబులెన్స్ ఉదయం 05:18 గంటలకు బాధితురాలి వద్దకు చేరుకుంది. ఆసుపత్రికి తరలిస్తుండగా గుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లె వద్దకు రాగానే నొప్పులు తీవ్రమ య్యాయి. దాంతో ఈఎంటీ పి.బాలాజీ, పైలట్ బి.గంగిరెడ్డి అంబులెన్స్‌లోనే ప్రసవం చేయాలని నిర్ణయించారు. విజయవం తంగా ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్య పరిస్థితి 10/10గా నమోదైంది. ప్రస్తుతం తల్లీబిడ్డలిద్ద రూ క్షేమంగా ఉన్నారు. ప్రసవం అనంతరం వారిని తదుపరి చికిత్స నిమిత్తం గుర్రంకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. సకాలంలో స్పందించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు, ఉన్నతాధికారులు అభినందించారు.

## నెలాఖరుకు 60 శాతం ల్యాండ్ పూలింగ్

- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ
- సీఆర్‌డీఏ త్రిసభ్య కమిటీ సమావేశం
- రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులకు ఆదేశం



అమరావతి(చైతన్యరథం): తుళ్లూరు, అమరావతి మండలంలో జరుగుతున్న ల్యాండ్ పూలింగ్ ఈనెల చివరి నాటికి 60 శాతం పూర్తవుతుందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలోని భూ సంబంధిత సమస్యలు, గ్రామ కంఠాల అంశాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై సీఆర్‌డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. రాజధాని పరిధిలో ఉన్న గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, రోడ్ల నిర్మాణం వల్ల ప్రభావితమవుతున్న నిర్వాసితుల సమస్యలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. సమావేశం అనంతరం విలేకరులతో పెమ్మసాని చం ద్రశేఖర్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో గ్రామ కంఠాల సమస్యలు, ఎఫ్‌ఎస్‌ఐ అంశాలు, మౌలికవసతుల అభివృద్ధి వంటి విషయాలపై గ్రామాల్లో పర్యటించి గ్రౌండ్ లెవెల్‌లో పరిస్థితులను పరిశీలించాలని సూచించినట్లు చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, తద్వారా స్థానిక సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చని కమిషనర్‌కు సూచించినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు, స్మశానాల ఏర్పాటు వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వం రూపొందించిన పాలసీ ప్రకారమే సమస్యలకు పరిష్కా రం అందిస్తామని, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఆర్-5 జోన్‌ను వెనక్కి తీసుకున్నట్లు చెప్పిన ఆయన ప్రస్తుతం మూడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ 40 శాతం పూర్తయిందని, ఈ నెలాఖరుకల్లా అది 60 శాతానికి చేరుకుంటుందని తెలిపారు. కౌలు పెంపు కారణంగా రైతులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీఆర్‌డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ, అధికారులు పాల్గొన్నారు.

## క్యాట్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే

- ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి షాక్
- కాదంబరి జత్వాని అక్రమ అరెస్ట్ వ్యవహారం




అమరావతి(చైతన్యరథం): ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాక్ ఇచ్చింది. క్యాట్ ఉత్తర్వులపై స్టే విధించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. సినీ నటి కాదంబరి జత్వాని అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం కేసులో విశాల్ గున్నిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే విశాల్ గున్ని సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకుని పోస్టింగ్ ఇవ్వాలని గత ఏడాది ఆగస్టు 28వ తేదీన క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఉత్తర్వులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. డీజీపీ, సీఎస్ తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు విని పించారు. సస్పెన్షన్ కాల పరిమితి ముగియక ముందే ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దాని కారణంగా విచారణ ముందుకు వెళ్లలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇక, విశాల్ గున్ని తరుపున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. కేసుపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది.

## నిర్మాత ఆర్.బి.చౌదరి మృతికి మంత్రి కందుల దుర్గేష్ సంతాపం





అమరావతి(చైతన్యరథం): ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ ‘సూపర్ గుడ్ ఫిలిమ్స్’ అధినేత ఆర్.బి.చౌదరి రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్.బి.చౌదరి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారనే వార్త నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. తెలుగు, తమిళ భాషల్లో కుటుంబసమేతంగా చూడదగ్గ ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించారు. చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న గొప్ప నిర్మాతను కోల్పోవడం సినీ రంగానికి తీరని లోటు” అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.







# దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు గెజిట్

## విశాఖలో అంబరాన్నంటిన సంబరాలు




- చంద్రబాబు, లోకేష్ చిత్రపటాల ప్రదర్శన
- రాష్ట్ర అభివృద్ధికి కీలక మలుపు అని హర్షం

దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో విశాఖపట్నంలో సంబరాలు అంబరాన్నంటాయి. విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ముందు చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించి బాణాసంచా పేల్చి టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, లోకేష్‌లకు విశాఖ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# వెలిగొండ పనులను పూర్తిచేయాలి

- చిక్కుకుపోయిన టీబీఎం మెషిన్ తొలగించాలి
- త్వరలోనే నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ బిల్లులు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



మార్కాపురం (చైతన్యరథం): వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో మూడు గంటల పాటు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఆయన వెలిగొండ పనులను పరిశీలించారు. చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి 2026 సీజన్ మొదలయ్యేలోగా పూర్తి చేసే లక్ష్యం కోసమే నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. టన్నెల్స్‌లో లైనింగ్ పనులు నెమ్మదించడంపై సీరియస్ అయ్యారు. వెలిగొండ పనులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోలు, డీజిల్, టన్నెల్స్‌లో మనుషుల కొరత, యంత్రాల పెంపు వంటి సమస్యలను అధిగమించి లక్ష్యం మేర పనులు పూర్తి చేయాలని ఏజెన్సీను ఆదేశించారు. 5 గ్యాంట్రీలతో చేస్తున్న లైనింగ్ పనులను స్వయంగా పర్యవేక్షించేందుకు టన్నెల్స్‌లోకి వెళ్లారు. టన్నెల్-2లో 12వ కి.మీ దగ్గర చిక్కుకుపోయిన టీబీఎం మిషన్ తొలగించడానికి హైకోర్టు అనుమతిచ్చింది. టన్నెల్స్ నుంచి 54 టీఎంసీల నీరు తరలించాలంటే టీబీఎం మెషిన్ తొలగించాల్సిందే. టీబీఎం మెషిన్‌ను తొలగించడానికి వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు. త్వరలోనే నిర్వాసితుల కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ బిల్లులు జమ చేయడం ప్రారంభిస్తామని తెలిపారు.

# రైతుల పాలిట కాలకేయ్యులు

## అడ్డంగా దొరికిన పొన్నూరు మొక్కజొన్న దొంగ

- వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ గోదాములోనే నిల్వలు
- దళారులతో తక్కువ ధరకు కొని రైతులకు నష్టం
- దొంగే దొంగ అన్న చందాన ఎమ్మెల్యేపై దుష్ప్రచారం
- ఇటీవల గుంటూరులో దొంగ దీక్ష నాటకం
- వాస్తవాలను బట్టబయలు చేసిన రైతు సంఘాలు



గుంటూరు(చైతన్యరథం): దొంగే దొంగ దొంగ అన్న చందాన మొక్కజొన్న రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ గుంటూరు వేదికగా అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ చేసిన దొంగ దీక్షను మంగళవారం పొన్నూరు రైతు సంఘాలు, తెలుగుదేశం పార్టీ నాయకులు బట్టబయలు చేశారు. ఇటీవల గుంటూరు జిల్లాలో మొక్కజొన్న రైతుల కోసం వైసీపీ దీక్ష చేసిన సంగతి విదితమే. ఈ దీక్షలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను టార్గెట్ చేస్తూ సంగం డెయిరీ మొక్కజొన్న రైతుల వద్ద మార్కెట్ కంటే తక్కువ ధరకు కొని నిల్వలు చేస్తుందని, దానికి దళారులను ధూళిపాళ్ల నియమించారని వైసీపీ నాయకులు ఆరోపణలు చేశారు. చేసిన ఆరోపణలపై వాస్తవాలను వెలికి తీసి ప్రజల ముందు అసలు దోషులను నిలబెట్టారు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్. మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వల మీద వస్తున్న ఆరోపణ ల్లో వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని గ్రామ గ్రామాన పార్టీ నాయకులు, రైతుసంఘాలు వెళ్లి ప్రజలకు వాస్తవాలను తెలియజే యాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు టీడీపీ బృందం మంగళవారం పొన్నూరు నుంచి గ్రామాల పర్యటనకు వెళుతున్న క్రమంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లిలోని వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ ఇంటి పక్కన ఎన్నికల కోసం నిర్మించిన గోదాములో దళారులు, ముఖ్య అనుచరులు అంబటి వెంకటకృష్ణ తదితరు లతో తన స్వంత పెట్టుబడితో క్వింటా ధర మార్కెట్ కన్నా తక్కువ రూ.1600 నుంచి రూ.1720 కొనుగోలు చేసి నిల్వ చేసిన మొక్క జొన్న నిల్వలను టీడీపీ బృందం పట్టుకుంది. మొక్క జొన్న నిల్వలు , వైసీపీ జెండాలు, ఆయన అనుచరులను అక్కడ గుర్తించి ఎమ్మె ల్యేపై చేస్తున్న ఆరోపణలకు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు కాలకేయుడు, మోసగాడు మురళీ, మొక్కజొన్న దొంగ, దళారీల గ్యాంగ్ లీడర్ అంబటి మురళీ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దొంగే దొంగ దొంగ అన్న చందాన గుంటూరులో పెద్ద దీక్ష పెట్టి నాటకాలకు తెరతీసిన వైసీపీని, అంబటి మురళిని ఎండగట్టారు. తన అనుచరులతో తానే పెట్టుబడి పెట్టి కేవలం క్వింట మొక్కజొన్న రూ.1600/1700లకు కొనిపించి అక్రమ నిల్వ చేస్తూ రైతులచే రైతుల కోసం నిర్వహిస్తున్న సంగం డెయిరీ కొనుగోళ్ల మీద ఆరోపణలు చేయటం సిగ్గు చేటని, అంబటి మురళీకృష్ణ కొనుగోలు చేయిస్తున్న ధర కంటే రూ.500 ఎక్కువ ధరకు రూ.2100/2200లకు సంగం డెయిరీ కొనుగోలు చేసిందని రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సాక్షాత్తు అంబటి మురళీకృష్ణే దళారీలకు నాయకత్వం వహిస్తూ మొక్కజొన్న అక్రమ నిల్వలు చేయడమే కాక రోజూ ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టేలా టీడీపీపై దుష్ప్రచారం చేసేలా వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం చూసి పొన్నూరు ప్రజలు నివ్వెరపోయారు. ఇదే వైసీపీ మార్క్ రాజకీయం, నేరాలు, దందా లు, దోపిడీలను కప్పిపుచ్చుకునేందుకు ఎంతటికి తెగిస్తారో, బురద జల్లుతారో తేటతెల్లం అయింది. జొన్న రైతులను దోచిందెవరో.. జొన్నలు దాచిందెవరో ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. అడ్డంగా దొరికిపోయిన మొక్క జొన్న అసలు దళారి, దోపిడీ దొంగ అంబటి మురళీకృష్ణ ఇప్పుడు ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారో చూడాలి.







# రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ



మైలవరం (చైతన్యరథం): కర్షకులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలతో రైతుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామంలో 167 పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మంగళవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... ఆస్తి అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధ హక్కు అన్నారు. గత ప్రభుత్వం హయాంలో వ్యక్తిగత ఫోటోలతో ముద్రించిన పాసు పుస్తకాలు ఇవ్వడం వల్ల అనేక సాంకేతిక, న్యాయ సంబంధిత సమస్యలు తలెత్తాయన్నారు. ప్రత్యేకంగా అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ఫోటోతో ముద్రించిన పుస్తకాల విషయంలో సమాజంలో గందరగోళం ఏర్పడిందన్నారు. భూమి రికార్డుల విషయంలో స్పష్టత లోపించిన కారణంగా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తూ భూ యజమానులకు హక్కులపై సంపూర్ణ భరోసాను కల్పిస్తోందని తెలిపారు. రాజముద్రతో రూపొందించిన పాసుపుస్తకాలు ప్రభుత్వ అధికారిక ధృవీకరణకు ప్రతీకగా నిలిచి, భవిష్యత్తులో ఎలాంటివి వాదాలకు తావులేకుండా చేస్తాయన్నారు. రుణ సదుపాయాలు కూడా సులభంగా లభిస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం తగు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, సోలార్ యూనిట్లు, అన్నదాత సుఖీభవ కింద యేడాదికి రూ.20 వేలు, సకాలంలో ఎరువులు పంపిణీ, పంటలకు గిట్టుబాటు ధరలతో వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.

# ఆల్ టైం టౌన్ రికార్డు సాధించిన విద్యార్థినికి ఎమ్మెల్యే సన్మానం



జగ్గయ్యపేట (చైతన్యరథం): జగ్గయ్యపేటకు చెందిన చేగు విద్యాలయం విద్యార్థిని కొల్లా శ్రీవల్లి పదవ తరగతి పరీక్షల్లో 596 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్‌తో పాటు పట్టణ చరిత్రలోనే అత్యుత్తమ ఫలితాన్ని నమోదు చేసింది. ఈ సందర్భంగా జీ=జ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ, శ్రీవల్లి సాధించిన విజయం విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆమె తల్లిదండ్రులు, చేగు విద్యాలయం యాజమాన్యం మరియు అధ్యాపకులను అభినందించారు. శ్రీవల్లి, JRC కళాశాల వైస్ ప్రిన్సిపాల్ K.N. రమేష్ మరియు అనూజ దంపతుల కుమార్తె కావడం విశేషం. కుటుంబం, పాఠశాల, క్రమశిక్షణ – ఈ మూడు కలిసి వచ్చినప్పుడు అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ ఊ కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట్ రాజీవ్, యాజమాన్య సభ్యులు ఈశ్వరయ్యశెట్టి, ఉదయభాస్కర్, కొత్తమాసు మల్లిఖార్జునరావు, రాయపూడి నరసింహారావు, అబ్బులు, జల్లా తిరుపతిరావు, సుధీర్, రాజు, నారాయణరావు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు భారీగా హాజరై శ్రీవల్లిని అభినందించారు.

# పామర్రు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆకస్మిక తనిఖీలు



పామర్రు (చైతన్యరథం): నియోజకవర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మంగళవారం తనిఖీ చేపట్టారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఆయన... సీహెచ్‌సీ సిబ్బంది పనితీరు, ల్యాబ్ పరికరాలు, రిజిస్టర్ల వెరిఫికేషన్, సిబ్బందికి ఉన్న సౌకర్యాలు అన్నింటినీ సమీక్షించారు. వైద్యులను రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. రోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పై అధికారులతో మాట్లాడి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు. వేసవి కాలంలో రోగులు అధిక ఉష్ణోగ్రతల వలన ఇబ్బందులు పడకుండా త్వరలోనే మార్గదర్శుల సహకారంతో పీ4 పథకం ద్వారా ఎయిర్ కండిషనర్‌ను అందజేస్తానని సిబ్బందికి తెలియజేశారు. నూతనంగా నిర్మిస్తున్న CHC భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ వారితోపాటు వైద్య సిబ్బంది, సీనియర్ నాయకులు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన రైల్వే జోన్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు : ప్రత్తిపాటి

**●విశాఖ రైల్వే జోన్'... ముఖ్యమంత్రి అభివృద్ధి ఆలోచనల కార్యరూపంలో మరో ప్రధాన అడుగు**



చిలకలూరిపేట (చైతన్యరథం): "నిన్న అమరావతికి చట్టబద్ధత.. నేడు విశాఖ రైల్వే జోన్ కు గెజిట్ నోటిఫికేషన్, ఇవి రెండూ డబుల్ ఇంజిన్ సర్కార్..రాకెట్ స్పీడ్ వేగానికి, ఢిల్లీ, అమరావతి పాలకుల వేగవంతమైన సుస్థిర పాలనకు గీటురాళ్లు అనే చెప్పాలి. కొత్త రైల్వే జోన్ తో, రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఆలోచనల కార్యరూపంలో మరో ప్రధాన అడుగు పడినట్లైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కృషి, పరస్పర సహకారం వల్లే 1 జూన్ 2026 నుంచి అమల్లోకి విశాఖ డివిజన్ కేంద్రంగా నూతన రైల్వే జోన్. 2014 విభజన చట్టం హామీల్లో మరో ప్రధాన వాగ్దానం అమలుపై ప్రజల్లో హర్షాతిరేకాలు. ఈ తరహా రవాణా వ్యవస్థలతో పాటు.. కేంద్రం ఇబ్బడిముబ్బడిగా రాష్ట్ర ప్రగతికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని, అప్పుడే ప్రధాని మోదీ చిరకాల స్వప్నమైన వికసిత్ భారత్‌లో ఏపీ కీలక భూమిక పోషించగలుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

**కొత్త జోన్‌తో ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్‌లకు అనుసంధానిస్తూ ధృఢమైన రైల్వే కారిడార్**

కొత్త జోన్‌తో పాటు.. ప్రత్యేక వందే భారత్, అమృత్ భారత్ రైళ్ల కేటాయింపుతో రాష్ట్ర రైల్వే వ్యవస్థ మునుపెన్నడూ లేని విధంగా బలోపేతం అవనుంది. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలతో పాటు.. పారిశ్రామిక అభివృద్ధికి మార్గం సుగమం కానుంది. రాష్ట్రంలోని ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్‌లను అనుసంధానిస్తూ ధృఢమైన, విశాలమైన సరికొత్త రైల్వే కారిడార్ ఏర్పడనుంది. చౌకైన, సౌకర్యవంతమైన, మెరుగైన రైల్వే ప్రయాణ సౌకర్యంతో పాటు భారీ సరుకు రవాణా వ్యవస్థ ప్రజలకు అందుబాటులోకి రానుంది. కొత్త జోన్ పరిధిలో 74 స్టేషన్ల ఆధునికీకరణతో పాటు.. 1039 కి.మీ. మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కి చంద్రబాబునాయుడు ప్రశంసలు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన తూర్పుగోదావరి జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ హాజరై తమ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రికి నివేదికలు సమర్పించారు. రాజమహేంద్రవరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా తమ పనితీరుపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలపడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.


# గుంటూరు పశ్చిమలో "మహిళా గ్రీవెన్స్" కార్యక్రమం



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గళ్ళా మాధవి ఆదేశాల మేరకు, నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో "మహిళా గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు, స్థానిక ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, అంగన్వాడీ అధ్యక్షురాలు నంది సరస్వతి, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పంచుమర్తి కల్పన, టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ గంటా మౌళిక పాల్గొని అర్జీలు స్వీకరించారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అర్జీలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. మహిళలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళలకు తమ సమస్యలు వెల్లడించే వేదిక కల్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

# డిజిటల్ గవర్నెన్స్ మరింత పటిష్టం

- **రాష్ట్ర వ్యాప్తంగా వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీలపై ఏపీ టీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం**
- **మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ**



ఉండవల్లి / అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ, ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలను మరింత పటిష్టంగా అమలు చేస్తామని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ గవర్నెన్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉండవల్లి నివాసంలో ఆంధ్రప్రదేశ్ ఐటీశాఖా మంత్రి నారా లోకేష్‌తో భేటీ అయిన మన్నవ మోహన కృష్ణ... రాష్ట్రంలో డిజిటల్ పాలనను మరింత బలోపేతం చేసే దిశగా చేపడుతున్న కీలక కార్యక్రమాలు, కొత్తగా అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శక సేవలు అందించేందుకు తీసుకొస్తున్న టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలపై సమగ్రంగా నారా లోకేష్‌తో ప్రత్యేకంగా చర్చించారు. మంగళగిరిలో APTS CSR నిధులతో ఏర్పాటు చేయబోయే ఆధునిక పార్క్ ప్రాజెక్ట్‌పై మన్నవ మోహన కృష్ణ మంత్రి నారా లోకేష్‌కు వివరించారు. ప్రజలకు మెరుగైన వసతులు, పట్టణ అభివృద్ధికి దోహదపడే విధంగా ఈ ప్రాజెక్ట్ ఉండబోతుందని తెలిపారు. అలాగే గూగుల్ సంస్థతో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, క్వాంటంవ్యాలీ వంటి అత్యాధునిక ప్రాజెక్టులపై కూడా చర్చ జరిగిందని, ప్రపంచ స్థాయి సంస్థలను ఆంధ్రప్రదేశ్‌కు ఆకర్షించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత పారదర్శక పాలన ద్వారానే అవినీతి నిర్మూలన సాధ్యమని నారా లోకేష్ స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా డిజిటల్ సేవలను గ్రామ స్థాయికి విస్తరిస్తోందని తెలిపారు. APTS ఈ దిశగా కీలక పాత్ర పోసిస్తోందని లోకేష్ పేర్కొన్నారు. అమెరికాలో ఐటీ పారిశ్రామికవేత్తలతో మన్నవ మోహన కృష్ణ చర్యలు జరిపి, రాష్ట్రానికి ఐటీ కంపెనీలను తీసుకురావడానికి చేస్తున్న కృషికి నారా లోకేష్ మన్నవ మోహన కృష్ణని అభినందించారు.

## భూ సమస్యలపై త్వరలోనే పూర్తి పరిష్కారం

**●సీఆర్డీఏలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశం**

**●విలేకరులతో మాట్లాడిన కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, శ్రావణ్**



అమరావతి (చైతన్యరథం): రాజధాని రైతుల భూ సంబంధిత అంశాలపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రాయపూడిలో సీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... సీఆర్డీఏకు కొత్త కమిషనర్‌గా విజయ రామరాజు ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిషన్ గారికి రాజధాని సంబంధిత పలు అంశాలపై అవగాహన కల్పించడంలో భాగంగా సమీక్ష నిర్వహించుకున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని గ్రామ కంఠాల సమస్యలు, కొన్ని ఎఫ్ఎస్ఐ గ్రామాల్లోని మౌలిక వసతులు, తదితరాంశాలపై అధికారులు గ్రౌండ్ లెవెల్‌కు స్వయంగా వెళ్లి పరిశీలిస్తే స్థానిక సమస్యలు తెలుస్తాయి అని అన్నారు. **మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ...** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, స్మశానాల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించే విధంగా కొత్త కమిషన్‌తో కలిసి అందరం చర్చించామని, రాజధాని పరిధిలోని 29 గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, తద్వారా స్థానిక సమస్యలు అర్థం అవుతాయని కమిషనర్‌కి త్రిసభ్య కమిటీ తెలియజేసింది. ఏదైతే పాలసీని ఏర్పాటు చేశామో, దాని ప్రకారమే సమస్యలకు పరిష్కరిస్తాము తప్ప, వ్యక్తిగతంగా ఎవరికి ఎలాంటి ప్రయోజనం చేయకూడదన్నారు. **ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ...** పార్లమెంట్ అసెంబ్లీ సమావేశాల కారణంగా త్రీమెన్ కమిటీ సమావేశం జరిగి రెండు నెలలు గడిచింది. రోడ్ల నిర్మాణాల వల్ల ఇళ్ళు కోల్పోతున్న వారికి ఎన్‌సీపీ కాలనీ ద్వారా enhanse చేయాలని చర్చిచామన్నారు.

## సేవే టీడీపీ లక్ష్యం ... రప్పా రప్పా వైసీపీ లక్ష్యం

**●ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ**




విజయవాడ (చైతన్యరథం): “సేవ చేయడమే తెలుగుదేశం పార్టీ అసలు సంస్కృతి” అని, వైసీపీ మాత్రం రప్పా రప్పా అంటూ విష సంస్కృతితో ముందుకు సాగుతుందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 2వ డివిజన్ గుణదల పడవల రేవు సెంటర్‌లో డి. శ్రీనివాస్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ... ఎండలు, వడగాల్పులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు అండగా నిలవడం టీడీపీ బాధ్యతగా భావిస్తోందన్నారు. ప్రజల కష్టసమయంలో ముందుండి సేవ చేయడం టీడీపీ నైజమని, వైసీపీ మాత్రం “రప్పా రప్పా” అంటూ ఆరోపణలు, బెదిరింపు రాజకీయాలతో ముందుకు సాగుతోందని విమర్శించారు. తూర్పు నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల ప్రజల చిరకాల కోరిక అయిన ఇళ్ల పట్టాల కోసం ఇప్పటికే సర్వేలు చేపట్టామని, త్వరలోనే అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు అందజేస్తామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2014-2019 మధ్య రాష్ట్రంలో అభివృద్ధి, సంపద సృష్టికి బాటలు వేసారని, కానీ తరువాత వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం వెనుకబడిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మళ్లీ అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని, పరిశ్రమలను ఆకర్షించి పెట్టుబడులు తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. గూగుల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రానికి రావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని తెలిపారు.

## భావితరాల వారికి భరోసా సీఎం చంద్రబాబు

ఉయ్యూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్‌ని నియమించిన సందర్భంగా ఉయ్యూరులోని ఆయన స్వగృహంలో పలువురు టీడీపీ కార్యకర్తలు, కాపుల రామాలయం కమిటీ సభ్యులు, పండ్ల వర్తక సంఘం నాయకులు, ఉయ్యూరు టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... సీఎం నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు మన బిడ్డల భవిష్యత్తు కోసం, భావితరాల వారికి తీవ్ర కృషి చేస్తున్నారని, అన్ని రంగాలలో భరోసా కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని అన్నారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌ని మొట్టమొదటి స్థానంలో నిలపాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారని, పరిశ్రమలను ఆకర్షించి పెట్టుబడులు తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. గూగుల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రానికి రావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని తెలిపారు. త్వరలోనే అమరావతి, పోలవరం పూర్తి అవుతాయన్నారు.

## ఉపాధి హామీ పథకంలో అవినీతిని సహించేది లేదు

**● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హెచ్చరిక**



వినుకొండ (చైతన్యరథం): గ్రామీణ ప్రాంత పేద ప్రజల కోసం ఉద్దేశించిన గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు హెచ్చరించారు. మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ‘ప్రజాదర్బార్’ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను, సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. ముఖ్యంగా పేదల పొట్ట కొట్టే విధంగా ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణపై తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, ఉపాధిలో అవినీతిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది తమ పనితీరు మార్చుకోవాలని, ఒకవేళ అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే అక్రమంగా కాజేసిన సొమ్మును పైసాతో సహా వసూలు చేయడంతో పాటు బాధ్యులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదల ఆర్థికాభివృద్ధి కోసం, వారికి కనీస జీవనోపాధి కల్పించడం కోసం భారీగా నిధులు విడుదల చేస్తున్నాయని, అటువంటి ఉన్నతమైన ఆశయానికి గండి కొట్టేలా వ్యవహరించే అధికారులను వదిలిపెట్టబోమన్నారు. ప్రతి గ్రామంలోనూ అర్హులైన కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని, చేసిన పనికి తగిన వేతనం సకాలంలో అందేలా చూడటం అధికారుల బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ప్రజాదర్బార్‌లో మండల ప్రజలు తమ సమస్యలను నేరుగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకువచ్చారు. మౌలిక సదుపాయాలు, పెన్షన్లు, విద్యుత్, ఇతర సమస్యలపై అనేక ఫిర్యాదులు అందగా, ఆయన స్వయంగా ప్రజలతో మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## చిన్నారులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆత్మీయ విందు



నందిగామ / హైదరాబాద్ (చైతన్యరథం): మంగళవారం నాడు హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లో ఉన్న The GrandLine Buffet లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి, విద్యార్థులతో కలిసి ఆత్మీయంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపట్టిన ‘కలలకు రెక్కలు’ కార్యక్రమం ఎంతో ప్రశంసనీయమని The GrandLine Buffet యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా GrandLine వారు చిన్నారు ప్రతిభకు గుర్తుగా డైరీలను అందజేసి వారి విజయయాత్రకు శు భాకాంక్షలు తెలిపారు.

## టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే భాష్యం సన్మానం



పెదకూరపాడు (చైతన్యరథం): పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి అచ్చంపేట మండలానికి కీర్తి తెచ్చిన విద్యార్థులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. అచ్చంపేటలో ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన విజయాల్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల అంకితభావం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యే భవిష్యత్తుకు పునాది అని, ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని చేరుకునే దిశగా శ్రమించాలని అన్నారు.

## అడ్డంగా దొరికిపోయిన పొన్నూరు మొక్క జొన్న దొంగ అంబటి మురళి

**●వైసీపీ మార్క్ రాజకీయాన్ని బట్టబయలు చేసిన ధూళిపాళ్ళ**



పొన్నూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లా పొన్నూరు మండలం, మామిళ్లపల్లిలో వైసీపీ ఇన్‌ఛార్జ్ అంబటి మురళికి చెందిన గోడౌన్ వద్ద టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. గోడౌన్ షట్టర్ పగలగొట్టి లోపల దాచిన మొక్కజొన్న పంటను బహిర్గతం చేశారు. తాను నిల్వ చేసిన మొక్కజొన్న పంట కోసమే అంబటి మురళి దొంగ దీక్షలు చేశారని, వైసీపీ మార్క్ రాజకీయం మరోసారి బయటపడిందన్నారు. అనంతరం నేతలు మాట్లాడుతూ... దొంగే దొంగ దొంగ అని అరిచిన చందాన వైసీపీ నాయకుల తీరు ఉందని, మొక్క జొన్న రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చుతూ గుంటూరులో అంబటి మురళి ఆధ్వర్యంలో వైసీపీ చేసిన దొంగ దీక్షను పొన్నూరు రైతు సంఘాలతో కలిసి తాము బట్టబయులు చేదయం జరిగిందన్నారు. గుంటూరు జిల్లాలో మొక్క జొన్న రైతుల కోసం వైసీపీ దీక్ష చేసిన సంగతి విధితమేనని, దీక్షలో పొన్నూరు శాసన సభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను టార్గెట్ చేస్తూ సంగం డెయిరీ మొక్క జొన్న రైతుల వద్ద మార్కెట్ కంటే తక్కువ ధరకు కొని నిల్వలు చేస్తుందని దానికి దళారీలను ధూళిపాళ్ల నియమించారని వైసీపీ వరుస ఆరోపణలు చేయడం దారుణమన్నారు. మొక్క జొన్న కొనుగోళ్ళు నిల్వల మీద వస్తున్న ఆరోపణలను వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే రైతు సంఘాల నాయకులతో కలిసి మంగళవారం పొన్నూరు నుండి గ్రామాలను పర్యటన చేస్తూ పొన్నూరు మండలం మామిళ్లపల్లిలోని వైసీపీ ఇన్‌ఛార్జ్ అంబటి మురళీ కృష్ణ పక్కన ఉన్న గోదాములో నిల్వ ఉంచిన మొక్కజొన్న పంటను బహిర్గతం చేశామన్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు రూ.1600లకు కొనుగోలు చేసి పంటను అంబటి మురళి దాచిపెట్టారని, ఈ విషయాన్ని తొక్కిపట్టి తిరిగి తమ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటున్నారు. దొంగే దొంగ దొంగ అన్న చందాన వ్యవహరించిన తీరను తాము తాము ఎండగట్టామని టీడీపీ నేతలు పేర్కొన్నారు.

# మహానాడుపై కాకాణివి అనవసరపు మాటలు

**● మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆగ్రహం**



కోవూరు (చైతన్యరథం): టీడీపీ మహానాడుకు సంబంధించి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడు తెలుగుదేశం పార్టీ కుటుంబ పండుగ అని అన్నారు. మహానాడును కోవూరు నియోజకవర్గం కిసాన్ సెజ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రేపు ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమంతో మొదలవుతుందని.. జిల్లా నాయకత్వం మొత్తం హాజరవుతుందని తెలిపారు. మహానాడుపై మాజీ మంత్రి కాకాణి అనవసరపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహానాడుతో వైసీపీకి ఏం పని అని కోటంరెడ్డి ప్రశ్నించారు. మహానాడు.. కార్యకర్తలతో మమేకం అయ్యే సమావేశమన్నారు. మహానాడుకు రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో పదికి పది సీట్లు గెలుస్తామని చెప్పిన కాకాణి మాటలు రివర్స్ అయ్యాయని.. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కోటంరెడ్డి తెలిపారు. పెద్ద గొంతేసుకొని అరిస్తే అబద్ధం.. నిజం కాదన్నారు. గొడ్డలి పార్టీ అంటే వైసీపీ వణికిపోతోందన్నారు. వైసీపీ పార్టీ గొడ్డలి పార్టీ అని జగన్ సొంత చెల్లెలు చెప్పారని తెలిపారు. మంత్రి నారాయణ చెట్లలో దోపిడీ చేశారంటూ కాకాణి చేసిన ఆరోపణలకు ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. 'కాకాణి భాష బాగుంటే మేము సమాధానం ఇస్తాం. మీ భాషలో మీరు మాట్లాడితే, మా భాష వేరుగా ఉంటుంది' అంటూ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## పొదలకూరులో శ్రీహరికాలనీలో కార్డన్ సెర్చ్... 25 మోటార్ బైకులు స్వాధీనం

సర్వేపల్లి (చైతన్యరథం): పొదలకూరు పట్టణంలోని శ్రీహరికాలనీలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 25 మోటార్ బైకులు, ఐదు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొదలకూరు, వెంకటాచలం సీఐలు గుత్తి వెంకటరావు, సురేంద్రబాబు మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, క్రికెట్ బెట్టింగుల నిర్వహణపై తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, లేదంటే 112కు కాల్ చేయాలని కోరారు. కొత్త వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. ప్రజల భద్రత కోసమే పోలీస్ వ్యవస్థ పని చేస్తున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం వాహనాలకు సంబంధిత పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా వేసవితాపం తట్టుకోలేక పిల్లలు చెరువులు, కాలువల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురువుతున్నారని.. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## పీఎం సూర్య ఘర్ యోజన కింద 100% సబ్సిడీతో రూఫ్‌టాప్ సోలార్ యూనిట్

**●రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో పలు కార్యక్రమాల్లో ఏపీ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. గ్రామంలోని చిన్న హరిజనవాడలో డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ కుటుంబాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా 100% సబ్సిడీతో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్ యూనిట్‌ను లబ్ధిదారుడైన ప్రసాద్ గృహం వద్ద స్వయంగా ప్రారంభించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీ ఉషా రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణమండపంలో వెదురుపావులూరు గ్రామానికి చెందిన భూముల యజమానులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే గన్నవరం ప్రాంతంలో సోలార్ యూనిట్ల ఏర్పాటు తక్కువగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. బీసీ, ఓసీలకు రూ.78,000 సబ్సిడీ ఉన్నప్పటికీ ప్రజలు ముందుకు రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఎలక్ట్రికల్ ఏఈలు, అర్హత కలిగిన లబ్ధిదారులతో కలిసి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి, గ్రామ స్థాయి నాయకత్వం, బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని రోజుకు సుమారు 16 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ విధానంపై ప్రజలు ఆసక్తి చూపాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు గ్రామంలో 14 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ముస్తాబాద గ్రామం భౌగోళికంగా అనుకూలతలు ఉన్నప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధిలో వెనుకబడిందని విమర్శించారు. వెస్ట్రన్ బైపాస్, ఆంధ్రజ్యోతి రోడ్డు నిర్మాణం తర్వాత గ్రామానికి కొత్త రూపు వచ్చిందని, విజయవాడకు సమీపంలో ఉన్న ఈ గ్రామం భవిష్యత్తులో నగరంలో కలిసిపోయే అవకాశముందున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో ప్రజలు తనకు మెజారిటీ ఇచ్చారని గుర్తు చేస్తూ, పేదల ఇళ్లను తొలగించే ప్రయత్నాలను తాను అడ్డుకుని కాపాడనని, ప్రస్తుతం వారికి రిజిస్టర్ పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ పాలనతో ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ పాలన మధ్య ఇదే తేడా అని వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారి పనుల్లో ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, ముస్తాబాదలో కూడా త్వరలోనే 18 నుండి 20 చిన్న రోడ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ముస్తాబాద, కొండపావులూరు, పురుషోత్తపట్నం, సావరిగూడెం, జక్కులనెక్కలం గ్రామాల్లో ఇప్పటికే రూ.58.20 లక్షలతో సిసి రోడ్లు, రూ.87.50 లక్షలతో డ్రైన్లు, రూ.58.31 లక్షలతో విద్యుత్ పనులు సహా మొత్తం రూ.2.58 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. అదనంగా రూ.4.20 కోట్ల నిధులతో ఆర్అండ్‌బి రోడ్లు, చెరువుల మరమ్మత్తులు, ఆర్‌ఎస్‌కే భవన నిర్మాణం వంటి సుమారు రూ.5.15 కోట్ల పనులు మంజూరయ్యాయని వెల్లడించారు. గత ప్రభుత్వం హయాంలో రూ.700 కోట్లతో జగన్ బొమ్మతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలలో ఉన్న తప్పులను సరిచేసి, రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను సుమారు నేడు 500 మంది రైతులకు అందజేసినట్లు తెలిపారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య



చీరాల (చైతన్యరథం): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చీరాల నియోజకవర్గం పందిళ్ళపల్లి గ్రామం, జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచడం హర్షణీయమని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య వ్యాఖ్యానించారు. మంగళవారం పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పదో తరగతి ఫలితాల్ల అత్యధిక మార్కులతో రాణించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి చర్యల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో మన విద్యార్థులు ఉన్నత చదువుల్లోనూ మెరుగైన విజయాలు సాధించి, కుటుంబానికి, పాఠశాలలకు, మన ప్రాంతానికి గర్వకారణం కావాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొతరపు జనార్ధన్, ఉపాధ్యాయులు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే నా లక్ష్యం

**●తిరువూరులో సమీకృత ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సన్నాహం**



విజయవాడ (చైతన్యరథం): ఎన్ ఎస్‌ఎఫ్డిసి మరియు కేశినేని ఫౌండేషన్ సహకారంతో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని నందిగామ తిరువూరు నియోజకవర్గాల్లో సమీకృత ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం కోసం ఎంపీ కేశినేని చిన్ని జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా నేతృత్వంలో జిల్లాలోని పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ... ఎన్ఐఆర్డీ నుండి ఇప్పటికే చాలా కార్యక్రమాలు చేసాము కానీ ఎస్సీలకు ఆర్థిక అభివృద్ధి మీద దృష్టి పెట్టలేకపోయామని ఎప్పుడు తనకు వారిని ఆర్థికంగా ఏదో ఒక రూపంలో అభివృద్ధి పథంలోకి నడిపించాలని ఆలోచన ఎప్పుడూ వచ్చేదని అన్నారు ఎంపీగా విజయం సాధించిన తర్వాత నుండి విజయవాడ పార్లమెంట్‌లోని బలహీనవర్గాలైనా ఎస్సీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రెండేళ్లు కష్టపడి ఎన్ఎస్‌ఎఫ్డిసి సభ్యుణ్ని విజయవాడకు తీసుకురావడం జరిగిందని తెలియజేశారు తన మాట గౌరవించి ఇక్కడికి వచ్చిన ఎన్ఎస్ఎఫ్డిసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు ప్రతి ఎస్సీ కుటుంబం నుండి ఒక సెల్ఫ్ ఎంటర్‌ప్రెన్యూవర్ తయారుచేయాలని లక్ష్యంతో కేశినేని ఫౌండేషన్ ద్వారా అనేకమందికి వివిధ రంగాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఆర్థికంగా స్థిరపడే విధంగా ఎన్ఎస్ఎఫ్‌డిసి ద్వారా ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేసే విధంగా దారి చూపిస్తున్నామని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎన్ఎస్ఎఫ్డిసి సిజిఎం రమేష్ రావు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ స్త్రీ నిధి ఆంధ్ర ప్రదేశ్, ఏపీ ఎస్ ఎఫ్ సి మరియు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల ద్వారా రాయితీ రుణాన్ని అందించడం ద్వారా ఎస్సీ కుటుంబానికి అవసరమైన జీవనోపాధి కార్యక్రమాలను ప్రోత్సహించడం ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.

ఐఈడిపి మొదటి దశలో సుమారు 100 మంది ఎస్సీ మహిళలకు క్రెడిట్ లింకేజీను సులభతరం చేస్తుంది ఎన్ఐఆర్‌డి హైదరాబాద్‌లోని కేశినేని ఫౌండేషన్ ద్వారా నైపుణ్య శిక్షణను అందించారు ఐఈడిపి మొత్తం ఖర్చు రూ.20 కోట్ల వరకు ఉంటుంది సగటు రుణం లక్ష రూపాయలు mosj&e స్పాన్సర్ చేసిన ఎగ్జిబిషన్లలో లబ్ధిదారుల భాగస్వామ్యంతో వివిధ చర్యల ద్వారా ఎంటర్ రెన్యువల్ కెపాసిటీ బిల్డింగ్ తులిప్ కింద బ్రాండ్ బిల్డింగ్ మరియు మార్కెటింగ్ సహాయం సైతం ఏర్పాటు చేయడం ఐ ఈ డి పి యొక్క ప్రత్యేక లక్షణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా జిల్లా పరిశ్రమల అధికారియం మధు ఎల్ డి ఎం కె ప్రియాంక పశుసంవర్ధక శాఖ అధికారి ఎం హనుమంతరావు ఉద్యాన శాఖ అధికారి పి బాలాజీ కుమార్ డి ఆర్ డి ఏ పి డి ఏ ఎన్ వి నాంచారరావు ఎస్సీ కార్పొరేషన్ ఈవో పిటి సెల్వి మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కంబం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి : ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి విషయమై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత చెరువులలో ఒకటిగా గుర్తింపు పొందిన కంబం చెరువు విశిష్టతను మంత్రికి వివరించారు. కంబం చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలోని ఇతర పర్యాటక ప్రాంతాలనూ సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్... కంబం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలోని ఇతర పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపైనా దృష్టి సారిస్తామని తెలిపారు.

# ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తాం

**●గోర్విమానుపల్లె మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**



బనగానపల్లె (చైతన్యరథం): ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే ప్రత్యేక నిధులతో ప్రతి గ్రామంలో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నియోజకవర్గంలోని గోర్విమానుపల్లె మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. కొలిమిగుండ్ల మండలం గోర్విమానుపల్లె గ్రామంలో పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో సిఎస్‌ఆర్ నిధుల రూ.9 లక్షలతో ఏర్పాటుచేసిన నూతన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి... వాటర్ ప్లాంట్ ప్రారంభించిన అనంతరం స్వయంగా మంచినీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. గోర్విమానుపల్లెలో అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో సిఎస్‌ఆర్ నిధులు రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన అంగన్వాడీ కేంద్రాన్ని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కొలిమిగుండ్ల మండలం, బందర్లపల్లి చెక్ పోస్ట్ వద్ద ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన ఆర్‌ఓ ప్లాంట్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. వేసవిలో నీటి ఎద్దడికి ఆస్కారం లేకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలనే సంకల్పంతో మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మవరంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

**●జిల్లా కలెక్టర్‌కు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి**

**● పలుచోట్ల ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన యువనేత**



ధర్మవరం (చైతన్యరథం): పట్టణంలో గత కొన్ని రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ని కలిసి పలు అంశాల మీద వినతి పత్రం అందజేశారు. ఇందులో ప్రధానంగా ధర్మవరం మున్సిపాలిటీలోని అనేక కాలనీల్లో తాగునీటి సరఫరా సరిగా లేదని వివరించారు. శివానగర్, శాంతినగర్, రామ్‌నగర్, మరుతీ నగర్, దుర్గానగర్, సుందరయ్య నగర్, పీఆర్‌టీ వీధి, మార్కెట్ వీధి, సిద్దయ్యగుట్ట, ఎంజీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కొత్తపేట, లక్ష్మీనగర్, బాలాజీ నగర్, రాజేంద్రనగర్, టీచర్స్ కాలనీ, పార్ధసారథి నగర్, ప్రియాంక నగర్, కేతిరెడ్డి కాలనీ, వైఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాలు తరచుగా తాగునీటి సమస్య ఎదురవుతోందని చెప్పారు. సాధారణంగా 2నుంచి 5రోజులకు ఒకసారి నీటి సరఫరా ఉండగా, గత నెలలో కొన్ని ప్రాంతాల్లో 6 నుంచి 8 రోజులకు ఒకసారి మాత్రమే నీరు అందుతోందన్నారు. కొన్నిచోట్ల ప్రజలు బోర్‌వెల్, డైరెక్ట్ పంపింగ్‌పై ఆధారపడుతున్నారన్నారు. పార్నపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద తరచూ విద్యుత్ అంతరాయం కలగడమే కాకుండా శివానగర్ లోని ఫిల్ట్రేషన్ పాయింట్ వద్ద పైప్‌లైన్ లీకేజీలు, హెడ్‌వర్క్స్ వద్ద పంపుల సామర్థ్యం తగ్గడం, మున్సిపల్ పరిధి విస్తరణతో నీటి అవసరం పెరగడం వంటి సమస్యలు ఉన్నాయని వివరించారు. అమృత్-1, అమృత్-2 పథకం కింద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ధర్మవరం లేఅవుట్ కాలనీలలో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు రోడ్లు లేక అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. మరోవైపు జలధార – జలహారతి సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో ధర్మవరం అసెంబ్లీ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో మొత్తం 216 పనులు గుర్తించినట్టు చెప్పారు. ఇందులో పెద్ద చెరువులకు ఫీడర్ ఛానల్స్ లో మొక్కలు తొలగించడం, మట్టి తొలగింపు వంటి పనులు యంత్రాలతో చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులకు నీరు నిరంతరాయంగా, త్వరగా చేరేందుకు హైడ్రాలిక్ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వీటికి తగిన అనుమతులు ఇవ్వాలని పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు.

# ఫ్లెక్స్ మీరు చెప్పినా... నేను చెప్పినా... కూటమి అభివృద్ధిపై చర్చకు రెడీ

**●వైసీపీకి మంత్రి సవిత సవాల్**



గోరంట్ల/శ్రీసత్యసాయి : 'రహదారులు లేని గ్రామాలకు రోడ్లు వేస్తున్నాం... రహదారులే అభివృద్ధికి రాచమార్గాలు.. బూచేపల్లికి రోడ్డు వేసిన తరవాతే వస్తానని చెప్పాను...ఈరోజు చేసి చూపించాను. గత పాలకులు మీటరు రోడ్డు కూడా వేయలేదు... కూటమి ప్రభుత్వం ఏర్పడిన చేసిన అభివృద్ధిపై నేను చర్చకు ఛాలెంజ్ చేస్తున్నాను.. ఫ్లెక్స్ మీరు డిసైడ్ చేసినా... నేను డిసైడ్ చేసినా చర్చకు సిద్ధం...' అని వైసీపీ నాయకులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సవాల్ విసిరారు. అయిదేళ్ల పాలనలో జగన్ రెడ్డి చేసిందేమీ లేదని, ఆయనదంతా చోరీ క్రెడిట్ అని , తమది అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. ఆయన చోరీ క్రెడిట్ ను చోరీ చేయాల్సిన దౌర్భాగ్యస్థితిలో ఎవరూ లేరన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం రూ.60 లక్షలతో కరావులపల్లి నుంచి కరావులపల్లి తండా వరకు నిర్మించిన బీటీ రోడ్డు, రూ.2.47 కోట్లతో బూచేపల్లి నుంచి కొత్తపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డును జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారుల నిర్మాణాలకు, అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రోడ్లేలేని గ్రామాలకు బీటీ, సీసీ రహదారులు నిర్మిస్తున్నారన్నారు. రోడ్లతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

**రోడ్డేసి మీ ఊరికి వచ్చా...**

గత ఎన్నికల్లో తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆనాడు బూచేపల్లి గ్రామస్తులు తన దృష్టి తీసుకొచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఆనాడే తాను చెప్పానని, రోడ్డేసిన తరవాత బూచేపల్లికి వస్తాయని స్పష్టం చేశానని మంత్రి సవిత తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ రూ.2.50 కోట్లతో బూచేపల్లికి బీటీ రోడ్డు నిర్మించామన్నారు. బూచేపల్లి పంచాయతీలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

**అభివృద్ధిపై చర్చకు రండి...**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలల కాలంలో ఎంతో అభివృద్ధి చేశామని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ నియోజక వర్గంపైగానీ, పులివెందుల, ధర్మవరంలో అభివృద్ధి గురించిగానీ తాను చర్చకు సిద్ధమని, వైసీపీ నాయకులు ముందుకు రావాలన్నారు. ఫ్లెక్స్ వారికి చెప్పమంటారా... తనకే చెప్పమంటారా...? అంటూ మంత్రి సవిత ఛాలెంజ్ చేశారు. గతంలో వలస పక్షుల పాలనలో పెనుకొండ నియోజక వర్గంలో అభివృద్ధి జాడేలేదన్నారు. మీటరు రోడ్డు కూడా వేయలేదన్నారు.

**జగన్ చోరీ క్రెడిట్ మాకు అక్కర్లేదు...**

అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ, అయిదేళ్ల పాలనలో రాష్ట్రానికి జగన్ రెడ్డి చేసిందేమీ లేదని మండిపడ్డారు. చివరికి పెట్టుబడిదారులను కూడా వదల్లేదని, వారిని కూడా బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను తరిమేసిన ఘనత జగన్ రెడ్డిదేనన్నారు. రాష్ట్రానికి ఒక కొత్త పరిశ్రమ తీసుకొచ్చారా... ఒక సాగునీటి కాలువ కూడా పూర్తి చేశారా..? అని నిలదీశారు. జగన్ ఏమి చేశారని, క్రెడిట్ చోరీకి పాల్పడదానికి అని ప్రశ్నించారు. జగన్ రెడ్డిది అంతా చోరీ క్రెడిట్ నవే, ఆ క్రెడిట్ తమకు అక్కర్లేదని అన్నారు. ఆయన హయాంలో ఏయే ఒప్పందాలు జరిగాయో..? వివరించాలని మంత్రి నారా లోకేశ్ అడిగారని, దానికి వైసీపీ నేతలు ఎందుకు నోరెత్తడం లేదని మంత్రి సవిత ప్రశ్నించారు.

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**

పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ రాకతో వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇప్పటికే కియా, బెల్ వంటి పరిశ్రమలు వచ్చాయన్నారు. తాజాగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ రానుండడంతో, ఈ ప్రాంతం రూపు రేఖలే మారిపోనున్నాయన్నారు.

# జలవనరుల శాఖ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల

**● కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన కీలక చర్చలు..!**



ఉదయగిరి (చైతన్యరథం) ఉదయగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పరిపాలన యంత్రాంగం ఆధ్వర్యంలో కీలకమైన జలవనరుల శాఖ సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షత వహించగా, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అనేక ముఖ్య అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ... ఉదయగిరి గత నాలుగు దశాబ్దాలుగా ఇక్కడి రైతులు ప్రధానంగా పసుపు పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అయితే సరైన రవాణా సదుపాయాలు లేకపోవడం వలన వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. గత ప్రభుత్వాలు ఈ కీలక సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయని పేర్కొంటూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బండగానిపల్లి ఘాట్ రోడ్ నిర్మాణానికి కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలోనే ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి, రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ఉదయగిరి నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమని గుర్తుచేస్తూ, సాగునీటి సమస్యల పరిష్కారం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. ప్రస్తుతంలో కొనసాగుతున్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి, రైతులకు నిరంతర సాగునీటి సరఫరా అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా సోమశిల ఉత్తర కాలువను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జలవనరుల శాఖ పరిధిలోని ఫేజ్-1, ఫేజ్-2 పనులు, అలాగే వెల్లిగొండ ప్రాజెక్ట్ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఎమ్మెల్యే సమగ్ర సమీక్ష నిర్వహించారు. గండిపాలెం ప్రాజెక్టులో పనిచేస్తున్న లస్కర్ల జీతభత్యాల సమస్యను కూడా ప్రస్తావించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన అంశాలపైన విస్తృత చర్చ జరిగింది. పి.డి దోమా,మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్, ఆర్డబ్ల్యుఎస్ శాఖ, హార్టికల్చర్ విభాగం తదితర శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ప్రతి శాఖ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఇటీవల బండగానిపల్లి గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతులు రహదారులు, విద్యుత్, త్రాగునీరు – సమగ్రంగా కల్పించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. విద్యుత్ శాఖ ద్వారా సాయిపేట మరియు నందిపాడు ప్రాంతాలలో సబ్ స్టేషన్లు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, దీని వల్ల స్థానికంగా విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఇది రైతులకు మరియు సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు.

# మహానాడు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం : మంత్రి నారాయణ

నెల్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహానాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఉత్సాహంగా సాగిన తెలుగు సింగపూర్

# ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్



సింగపూర్: టీం శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన TSP T10- తెలుగు సింగపూర్ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంట్, మే డే సందర్భంగా టిఆర్ సి (Terusan Recreation Centre) వద్ద ఘనంగా ముగిసింది. నెలరోజులపాటు వారాంతాల్లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో, సింగపూర్ నలు మూలల నుంచి వచ్చిన తెలుగు కార్మికులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తం 18 జట్లు పోటీపడిన ఈ టోర్న మెంట్‌లో, లీలా నాగేశ్ నాయకత్వంలోని తెలుగు వారియర్స్ జట్టు విజేతగా నిలవగా, సాహు చంద్రశేఖర్ నాయకత్వంలోని మెగాయార్డ్ రైడర్స్ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 17మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగగా,250 మందికి పైగా ఆటగాళ్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు వరుసగా SGD1,116, SGD558 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. వ్యక్తిగత విభాగంలో బండి శ్రీనివాస్ రెడ్డి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకోగా, శ్యామ్ ఉత్తమ ఆల్‌రౌండర్‌గా, ఆంథోనీ ఉత్తమ బౌలర్‌గా, విజ్జు ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా ఎంపికయ్యారు. మెగా యార్డ్ రైడర్స్ జట్టుకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు వ్యక్తిగత అవార్డులు గెలుచుకోవడం ఆ జట్టు ప్రతిభను ప్రతిబింబించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సారిక ప్రసాద్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే రాంబాబు పాతూరి(కాకతీయకల్చరల్ అసోసియేషన్), రత్నకుమార్ కవుటూరు (శ్రీ సాంస్కృతిక కళాసారథి), సింగపూర్ తెలుగు సమాజం పూర్వ అధ్యక్షులు రంగా రవి, చౌదరి జె తదితరులతో పాటు శేషారావు గూడూరి, వినయ్ కుమార్ సూర్యదేవర, సురేంద్ర చెన్రోలు, చంద్రశేఖర్ చిలుకూరి, హనుమంతరావు మాదాల, అమ్మయ్య చౌదరి, గంగాధర్ తాటి, సతీష్ పారేపల్లి, వేణు నార్నే తదితర ప్రముఖులు విచ్చేసి నిర్వాహకులు, క్రీడాకారులను అభినందించారు.

ఈ టోర్నమెంట్ విజయవంతం కావడంలో పీఎస్వీ ఇంజినీరింగ్,యూనిక్ గ్రూప్, బీఆర్ఎం ఇంజినీరింగ్, వీవీ ఇంజినీరింగ్, ఎస్‌జీడీ ఆర్ మెరైన్, ఫ్యూషన్ ఇంజినీరింగ్, ఏఎస్‌ఏపీ మెరైన్, సాంకో, టెక్ ఇంటర్నేషనల్, ఫాబ్‌టెక్ ఏషియా ఇంజినీరింగ్, ద్యూన్ ఆఫ్‌షోర్, శ్రీసత్య సంస్థలు, అలాగే సుధాకర్ జొన్నాదుల, విక్రమ్ సంకిరెడ్డిపల్లి, వంశీ కృష్ణ సిస్లా, సేతు మాధవి మొవ్వ, అనిత జ్యోతి మదిరి, వాసు బాబు పెంట్యాల, శివ కృష్ణ సూరంపల్లి, పాండు రంగారావు సురవరం, శివ ప్రసాద్ కొల్లా, గిరిధర్ సరాయి, సుదర్శన్ పూల, జమ్ముల సాంబ, కిషోర్ గణపతినీడి వంటి వ్యక్తిగత స్పాన్సర్లు తమ వంతు సహకారం అందించారు.

శివ ప్రసాద్ కొల్లా నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బి వర ప్రసాద్, గిరిధర్ సరాయి, అనిల్‌కుమార్ బొమ్మారెడ్డి తదితరులతోపాటు కో ఆర్డినేటర్లు, లాజిస్టిక్స్ టీమ్, అంపైర్లు, స్కోరర్లు మరియు వాలంటీర్లు అహర్నిశలు శ్రమించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సురేంద్ర చెన్రోలు,ఉమా మహేశ్వరరావు, గురురాజ్ బనకర్, శ్రీను యాదవ్, గొర్రెపాటి లక్ష్మీ రెడ్డి అంపైర్లుగా వ్యవహరించగా, రమేష్ వ్యాఖ్యాతగా కార్యక్రమానికి మరింత ఆకర్షణ తీసుకువచ్చారు. ఆర్కే వీడియోగ్రఫీ ద్వారా రాధాకృష్ణ గణేశ్న, కాత్యాయిని గణేశ్న ఫైనల్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయగా,సుదర్శన్ పూల ఫోటోగ్రఫీ ద్వారా టోర్నమెంట్‌ను అందంగా చిత్రీకరించారు. ఈ టోర్నమెంట్ కేవలం క్రికెట్ పోటీ మాత్రమే కాకుండా, కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి ఆనందంగా గడిపిన ఒక కమ్యూనిటీ ఉత్సవంగా నిలిచింది. ఆటగాళ్లకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ప్రోత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీం శివప్రసాద్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ విజయవంతం కావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, వచ్చే సంవత్సరం TSP T10 2027ను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మహిళల విభాగం ప్రవేశపెట్టడం, మెరుగైన లైవ్ స్ట్రీమింగ్, మరిన్ని సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. "సైట్‌లో కష్టం...గ్రౌండ్‌లో శక్తి"అనే నినాదంతో నిర్వహించిన ఈటోర్నమెం ట్, సింగపూర్ తెలుగు సమాజ ఐక్యత, శక్తి మరియు కృషికి ప్రతీకగా నిలిచింది.




## క్వీన్స్‌ల్యాండ్‌లో 17న ఉగాది వేడుకలు

క్వీన్స్‌ల్యాండ్: క్వీన్స్‌ల్యాండ్ తెలుగు అసోసియేషన్' (QTA) ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలోని తెలుగు వారి కోసం 'శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఈనెల 17న అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రవాస తెలుగువారిని అలరించనున్నాయి. ఈ సంబరాల్లో ప్రముఖ సినీ నేపథ్య గాయని అదితి భావరాజు ప్రత్యేక్ష సంగీత కచేరీ (Exclusive Music Concert) ప్రధాన ఆకర్షణగా నిలవ నుంది. ఈ వేడుకలు మే 17న (ఆదివారం) స్లాక్స్ క్రీక్ (Slacks Creek) లోని పారడైజ్ రోడ్‌లో గల 'యూనిటీ హబ్' (Unity Hub) వేదికగా జరగనున్నాయి. సాయంత్రం 05:00 గంటల నుండి రాత్రి 09:00 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌లుగా వ్యవహరించా లనుకునే వారు గౌతమ్ (0414244039), హేమంత్ (0476 834 001) లేదా విద్య (0416 559 639)లను సంప్రదించవచ్చు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబిం బించేలా నిర్వహించ తలపెట్టిన ఈఉగాది వేడుకలకు తెలుగు వారందరూ తరలివచ్చి విజయవంతంచేయాలని క్వీన్స్‌ల్యాండ్ తెలుగు అసోసియేషన్ కోరుతోంది.

## తానా మిడ్ అట్లాంటిక్ విల్ అండ్ ట్రస్ట్ విజయవంతం




ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ టీమ్ తాజాగా నిర్వహించిన విల్ అండ్ ట్రస్ట్ కార్యక్రమానికి అద్భుత స్పందన వచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా కుటుంబానికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని తానా మిడ్ అట్లాంటిక్ టీమ్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎంతోమంది పాల్గొన్నారు. దాదాపు 100 మందికిపైగా కుటుంబాలు తమ విల్ అండ్ ట్రస్ట్ పత్రాలను తమ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవడంతో పాటు తమ సంతతి వారికి ఉప యోగపడేలా చేసుకున్నాయి. ఎస్టేట్ ప్లానింగ్ ప్రాముఖ్యతపై కూడా ఈకార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. విల్ మరియు ట్రస్ట్ వంటి ముఖ్యమైన పత్రాలను కలిగి ఉండటం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా చాలామందికి తెలిసింది. ఈ కార్యక్రమం ద్వారా పలు సేవలను తానా టీమ్ అందించింది. నిపుణుల సలహాలు, ఉచిత నోటరీ సేవలు, ఉచిత డాక్యుమెంట్ ప్రింటింగ్, ఇతరత్రా సేవలను అందజేసింది.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి తమ మార్గదర్శకత్వాన్ని, నిరంతర సహకారాన్ని అందించిన తానా నాయకత్వ బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. తానా ప్రెసిడెంట్ డాక్టర్ నరేన్ కొడాలి, తానా బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరి, మిడ్-అట్లాంటిక్ ప్రాంతీయ ప్రతినిధి ఫణి కంతేటి, తానా బెనిఫిట్స్ కోఆర్డినేటర్ వెంకట్ సింగు, కమ్యూనిటీ సర్వీస్ కోఆర్డినేటర్ సాయి బొల్లినేని తదితరులు ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన చుగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఓస్టన్, తనిష్క్ యుఎస్ ఎ, స్ప్రింగ్ ఈగిల్స్ సంస్థలకు ఇతరులకు తానా మిడ్-అట్లాంటిక్ టీమ్ ధన్యవాదాలు తెలియజేసింది.






## 30న అట్లాంటాలో తెలంగాణా సాంస్కృతిక దినోత్సవం

అట్లాంటా: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రవాస భారతీయులకు చేరువ చేయడంలో ముందుండే గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ (GATeS) ఆధ్వర్యంలో 'తెలంగాణ సాంస్కృతిక దినోత్సవం - 2026' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. మే 30, శనివారం రోజు జరిగే ఈ వేడుకకు అట్లాంటాలోని ఆల్ఫారెట్టా వేదిక కానుంది. మే 30, 2026 (శనివారం) మధ్యాహ్నం 12:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు.

**వేదిక:** డెన్మార్క్ హైస్కూల్ (645 Mullinax Rd, Alpharetta, GA 30004).

ఈ వేడుకకు తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రథమ చైర్మన్ శ్రీ రసమయి బాలకిషన్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్లేబ్యాక్ సింగర్ స్వాతి రెడ్డి, ఫోక్ సింగర్ జనార్దన్ పన్నెల, గాయని సృష్టి చెల్లా తమ ప్రదర్శనలతో అలరించనున్నారు. వీటితో పాటు STRINGZ LIVE BAND ప్రత్యేక ప్రదర్శన సందడి చేయనుంది.

రిజిస్ట్రేషన్ వివరాలు..

ప్రవేశం: GATeS సభ్యులకు ఉచితం, ఇతరులకు ౩10 ప్రవేశ రుసుము ఉంటుంది. రిజిస్ట్రేషన్: tinyurl.com/GATeSEventRegistration ద్వారా నమోదు చేసుకోవచ్చు. స్టాల్స్: వ్యాపార ప్రదర్శన స్టాల్స్ కోసం tinyurl.com/VendorStallలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని GATeS ప్రెసిడెంట్ రమణ గంద్ర, బోర్డ్ చైర్మన్ జ్యోత్స్న పాలకుర్తి, ఇతర కార్యవర్గ సభ్యులు కోరుతున్నారు. మరిన్ని వివరాల కోసం gatesusa.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

◆ రూ.1.52 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాలు

న్యూఢిల్లీ: దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు.



**వ్యవసాయ రంగానికి పెద్దపీట**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026–27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్ కోసం ఏకంగా రూ.1 లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది.

**సెమీకండక్టర్ హబ్‌గా భారత్**

టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ.868 కోట్లు మంజూరు చేశారు.

**రైల్వే కనెక్టివిటీ విస్తరణ**

రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద – మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ – వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయిం చారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరు స్తుంది. బుర్వాల్ – సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎంఎస్‌ఎం ఈలకు మద్దతునిచ్చేలా ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ.18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో జడ్జిల సంఖ్య 33 నుంచి 37కు చేరుతుంది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

# రేపే విజయ్ ప్రమాణస్వీకారానికి సన్నాహాలు

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహ కాలు చేస్తోంది. పార్టీ అధినేత విజయ్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక కావడంతో ఈనెల 7న కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకర కార్యక్రమం ఉంటుం దని పేర్కొన్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అనూ హ్యంగా 108 స్థానాల్లో విజయం సాధించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు అవస రమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేకపోయింది. మెజారిటీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్ద తిచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో సంప్రదింపులు సాగించ నున్నట్టు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్–5, వీసీకే–2, సీపీఐ–2, సీపీఎం–2 సీట్లు గెలుచుకున్నాయి. ఐయూఎంఎల్, డీఎండీకే, పీఎంకే పార్టీలను నుంచి కూడా టీవీకేకు మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే




ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వా నించాల్సిందిగా గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు విజయ్ మంగళవా రం లేఖ రాసినట్టు తెలుస్తోంది. తమిళగ వెట్రి కళగం శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ అధినేత విజయ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# బెంగాల్‌లో మార్పు మొదలు..

**అసన్‌సోల్‌లో తెరుచుకున్న దుర్గ గుడి**




పశ్చిమబెంగాల్: బీజేపీ ఘన విజయం సాధించడంతో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మార్పులు మొదలయ్యాయి. రాజకీ య మార్పునకు ప్రతీకగా.. అసన్‌సోల్‌లో ఏళ్ల తరబడి మూత పడి ఉన్న దుర్గా ఆలయం తిరిగి తెరుచుకోవడం చర్చనీయాం శంగా మారింది. శ్రీ శ్రీ దుర్గామాత ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నడుస్తున్న ఈ ఆలయం ఎట్టకేలకు భక్తులకు అందుబా టులోకి వచ్చింది. ఆలయం తెరుచుకున్న వెంటనే స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించడం విశేషం. ఈ పరిణామం ప్రాంతీయ రాజకీయ మార్పునకు సంకేతమని బీజేపీ నేతలు అభివర్ణిస్తున్నారు. అసన్‌సోల్ దక్షిణ నియోజక వర్గంలో బీజేపీ తరఫున బరిలోకి దిగిన అగ్నిమిత్రా పాల్.. టీఎంసీ అభ్యర్థి తపస్ బెనర్జీపై 40,839 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో అగ్నిమిత్ర.. ఆలయ పునఃప్రారంభంలో కీలకపాత్ర పోషించారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ విషయమై ఆలయ కమిటీ సభ్యులు నీలు చక్రవర్తి మాట్లాడుతూ ఆలయం తిరిగి తెరవడం హిందూ సమాజానికి ఎంతో ఉపశమనం కలిగించిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల హామీలు కూడా ఆలయ పునఃప్రారంభానికి దోహదపడ్డాయి. అసన్‌సోల్ ఉత్తర్ అసెంబ్లీ నుంచి ఎన్నికైన కృష్ణేందు ముఖర్జీ.. ఈ ఆలయాన్ని ఏడాది పొడవునా తెరిచిఉంచేలా చర్యలు తీసుకుంటా మని ఎన్నికల ప్రచారంలో భాగంగా హామీ ఇచ్చారు. దీంతో ఆయన ఆలయాన్ని సంద ర్శించిన తరువాత అధికారికంగా పునఃప్రారంభ కార్యక్రమం జరిగింది. బెంగాల్‌లో మొత్తం 294 స్థానాలు ఉండగా.. బీజేపీ 206 స్థానాలు కైవసం చేసుకుని మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడం చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. దీంతో ఆ రాష్ట్రంలో దశాబ్దంన్నర కాలంగా పాలన సాగిస్తున్న టీఎంసీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ.. భవానీపూర్‌లో సువేందు అధికారి చేతిలో పరాజయం పాలవ్వడం.. రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచింది. మొత్తంగా చూస్తే.. బెంగాల్‌లో ప్రారంభమైన ఈ కొత్త రాజకీయ అధ్యాయం కేవలం ప్రభుత్వ మార్పునకే పరిమితం కాకుండా సామాజిక, సాంస్కృతిక రంగాలపైనా ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మూడు పార్టీలు..మూడు విజయాలు!

**- శాంటియాగో మార్టిన్ కుటుంబం అద్భుతం**

**- అసలైన లాటరీ అంటే ఇదే**



చెన్నై: తమిళనాడులో లాటరీ వ్యాపారం ప్రారంభించి వేల కోట్ల సామ్రాజ్యాన్ని సృష్టించిన లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ కుటుంబం తాజా ఎన్నికలలో అద్భుతం చేసింది. మార్టిన్ కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, మూడు పార్టీల తరఫున పోటీ చేసి, గెలుపొందారు. తమిళనాడు నుంచి ఇద్దరు, పుదుచ్చేరి నుంచి మరొకరు విజయం సాధించారు. మార్టిన్ భార్య లీమారోస్ మార్టిన్ అన్నాడీఎంకే తరఫున లాల్‌గుడి నియోజకర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. డీఎంకేకు కంచుకోట అయిన లాల్‌గుడి నియోజకవర్గంలో ఐదు వేలకు పైగా ఓట్ల మెజారిటీతో లీమారోస్ గెలుపొందారు. ఇక, మార్టిన్ అల్లుడు అర్జున, టీవీకే తరఫున విక్కివక్కం నియోజక వర్గం నుంచి బరిలోకి దిగారు. 17 వేల ఓట్ల ఆధిక్యంతో డీఎంకే అభ్యర్థిపై గెలుపొందారు. అలాగే, మార్టిన్ కొడుకు జోస్ మార్టిన్ పుదుచ్చేరి ఎన్నికల బరిలో దిగారు. ఎల్‌జేకే పార్టీ అధినేత అయిన జోస్, కామ్‌రాజ్ నగర్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1988లో తమిళనాడులో లాటరీ వ్యాపారం మొదలు పెట్టిన శాంటియాగో ఆ తర్వాత కేరళ, కర్ణాటకకు విస్తరించారు. ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాలకు మకాం మార్చారు. అక్కడి నుంచి నేపాల్, భూటాన్‌లో కూడా తన బిజినెస్ మొదలుపెట్టారు. శాంటియాగోకు చెందిన ఫ్యూచర్ గేమింగ్ సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ప్రపంచ లాటరీ అసోయేషన్‌లో కూడా సభ్యత్వం ఉంది. కాగా, శాంటియాగో వేల కోట్ల సామ్రాజ్యం వెనుక ఎన్నో ఆర్థిక మోసాలున్నాయని ఈడీ ఆరోపించింది. గతంలో శాంటియాగో కార్యాలయంలో సోదాలు కూడా నిర్వహించింది.

## కేజ్రీవాల్ కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం




న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవిం ద్ కేజ్రీవాల్ కేసులో ఢిల్లీ హైకోర్టు మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ తరఫున వాదనలు వినిపించేం దుకు ముగ్గురు సీనియర్ అమికస్ క్యూరీలను ఢిల్లీ హైకోర్టు నియమించింది. నిందితులు విచారణకు సహకరించకపోయినా న్యాయ ప్రక్రియ ఆగదని ఈ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులు తమ వాదనలు వినిపించడానికి నిరాకరిం చినప్పుడు.. కోర్టుకు సహాయం చేయడానికి నిష్పాక్షిక న్యాయవా దుల నియామకం చేస్తుందని కోర్టు వివరించింది. అమికస్ క్యూరీల నియామకం తర్వాతే సీబీఐ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరపనుంది. మద్యం పాలసీ కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై ఉత్కంఠ కొనసాగుతుంది. ఈ కేసు విచారణలో జడ్జి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆప్ నేతలు ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఆరోపించారు. దీంతో ఈ కేసు విచారణకు హాజరుకాకూడదని వారిద్దరు నిర్ణయించారు. ఆ క్రమంలో జస్టిస్ స్వర్ణ కాంత్ శర్మ బెంచ్‌ను వీరు బహిష్కరించిన విషయం విదితమే. ఈ కేసును విచారిస్తున్న ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత్ శర్మపై కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

## తమిళనాడు సీఎం స్టాలిన్ రాజీనామా



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ద్రవిడ మున్నేట్ర కజగం పరాజయం పాలైన నేపథ్యంలో.. ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. స్టాలిన్ రాజీనామాను గవర్నర్ వెంటనే ఆమోదించారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పా టయ్యే వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ ఆయన్ని కోరారు. తాజాగా జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. 234 అసెంబ్లీ స్థానాలకు గాను 108 స్థానాలను కైవసం చేసుకుంది. అధికారంలో ఉన్న డీఎంకే కేవలం 59 స్థానాలకే పరిమితమైంది. స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొలత్తూరులో ఓటమి పాలయ్యారు.

# మళ్లీ.. వేడెక్కిన హార్మూజ్!

- యూఏఈపై ఇరాన్ దాడులు..
- ముగ్గురు భారతీయులకు గాయాలు
- దాడులు ఆమోదయోగ్యం కాదన్న భారత్
- ప్రపంచాన్ని బందీగా చేయొద్దన్న దేశాలు
- ఈ పరిస్థితికి యూఎస్ కారణమన్న ఇరాన్



హర్మూజ్ జలసంధి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. జలసంధిలో చిక్కుకున్న వాణిజ్య నౌకలను 'ప్రాజెక్టు ఫ్రీడం'తో సురక్షితంగా బయటకు తెస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో చేసిన ప్రకటనతో వాతావరణం వేడెక్కింది. దీన్ని మానవతా దృక్పథంతో చేపట్టామని, తమ యుద్ధనౌకలు జలసంధిలోకి వెళ్తాయని ప్రకటనలో పేర్కొన్నారు. రెండు వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధి దాటినట్టు అమెరికా సైన్యం వెల్లడించింది. దీన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఏ నౌకా జలసంధి దాటలేదని స్పష్టం చేసింది. అమెరికా చేపట్టిన 'ప్రాజెక్టు ఫ్రీడం'ను ఖండిస్తూ.. తమ అనుమతి లేకుండా ఓ అమెరికా నౌక జలసంధిలోకి రావడానికి ప్రయత్నించిందని.. దానిపై క్షిపణులతో దాడి చేశామని ప్రకటించింది. దీన్ని అమెరికా సైన్యం ఖండించింది. ఒక్క నౌకపైనా దాడి జరగలేదని తెలిపింది. జలసంధిలో తమ కార్యకలాపాలకు అడ్డు తగిలేందుకు ప్రయత్నించిన ఏడు ఇరాన్ చిన్న నౌకలను ధ్వంసం చేశామని ప్రతి ప్రకటన చేసింది. మరోవైపు అమెరికా నౌకలపై దాడి చేస్తే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామని ట్రంప్ బెదిరించారు. ఈ నేపథ్యంలో యూఏఈపై సోమవారం ఇరాన్ నాలుగు క్షిపణులను ప్రయోగించింది. ఇందులో మూడింటిని అడ్డుకున్నామని.. ఓ క్షిపణి సముద్రంలో పడిందని యూఏఈ పేర్కొంది. ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపైనా ఇరాన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ఈ దాడితో అక్కడ భారీ మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. వీరికి ప్రాణాపాయం లేదని.. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి.

**స్పందించిన భారత్..**

ఇరాన్ డ్రోన్ దాడిలో ముగ్గురు భారతీయులకు గాయాలైన ఘటనపై భారత కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది. ఈ దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఖండించింది. మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. పశ్చిమాసియా అంతటా శాంతి, స్థిరత్వం పునరుద్ధరించేలా పరిస్థితులు చక్కదిద్దడానికి చర్చలు, దౌత్యం కోసం భారత్ తన మద్దతు కొనసాగిస్తుందని పేర్కొంది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హర్మూజ్ జలసంధి గుండా స్వేచ్ఛాయుత, నిరాటంకమైన నౌకాయానం, వాణిజ్యం జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సమస్యల పరిష్కారానికి చేసే అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి భారత్ సిద్ధంగా ఉందన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. యూఏఈపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. పౌరులను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రపంచ ఇంధన భద్రత కోసం హర్మూజ్ గుండా సురక్షితమైన నౌకాయానం జరగడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

**ప్రపంచాన్ని బందీగా చేయొద్దు..**

యూఏఈపై జరిగిన దాడుల నేపథ్యంలో.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. అమెరికాతో చర్చలు జరిపి.. సమస్యను పరిష్కరించుకోవాలని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, సౌదీ అరేబియా ఇరాన్‌ను కోరాయి. ఈ ఘర్షణలతో హర్మూజ్‌ను, ప్రపంచాన్ని బందీగా చేయొద్దని పేర్కొన్నాయి.

**కావాలని చేయలేదు: ఇరాన్**

ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌లోని చమురు శుద్ధి కేంద్రంపై కావాలని దాడి చేయలేదని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. నిషేధిత మార్గాలగుండా హర్మూజ్‌లో నౌకలను బయటకు తీసుకురావడానికి అమెరికా చేస్తున్న దుస్సాహసమే ఈ ఘటనకు కారణమని ఆరోపించింది. ఇకనైనా అమెరికా దౌత్య ప్రక్రియలో బలప్రయోగం చేసే ప్రవర్తనను వీడాలని పేర్కొంది. ప్రపంచంలోని అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే సున్నితమైన హర్మూజ్ జలసంధిలో అగ్రరాజ్యం తన సైనిక సాహసకృత్యాలను ఆపాలని డిమాండ్ చేసింది.

## క్రూజ్ నౌకలో 'హంటా' కలకలం!

**- ముగ్గురి మృతి.. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం**

**- కెప్ వెర్తే తీరంలో ఆగిన క్రూజ్ నౌక**



ఒక క్రూజ్ నౌకలో అరుదైన వైరస్ కలకలం సృష్టిస్తోంది. దాంతో అందులోని ప్రయాణికులు సముద్రంలో సాయం కోసం చూస్తున్నారు. వారంతా అట్లాంటిక్ మహాసముద్రంలో కేప్ వెర్డే తీరానికి సమీపంలో ఉన్నారు. ఇప్పటికే ముగ్గురు ప్రయాణికులు మృతి చెందడం.. మరో ముగ్గురు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో.. ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, షిప్ ఆపరేటర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎంవీ హొండియస్ (డచ్ షిప్) దాదాపు 150మంది ప్రయాణికులతో అర్జెంటీనా నుంచి బయల్దేరింది. వాస్తవంగా అంటార్కిటికా, అట్లాంటిక్ మహా సముద్రంలో వారంపాటు యాత్ర కొనసాగాల్సి ఉంది. అయితే అంతలోనే వైరస్ వ్యాప్తి చెందడంతో కేప్ వెర్డే తీరంలోకి వచ్చిన తర్వాత సహాయం కోసం నౌకనుంచి స్థానిక అధికారులకు అభ్యర్థన వెళ్లింది. అయితే అందులోని వారు దిగేందుకు అనుమతి లభించలేదు. ప్రజారోగ్య ఆందోళనల దృష్ట్యా తమ రేవులో ఆ నౌకను నిలిపేందుకు ప్రస్తుతానికి అనుమతివ్వలేదని కేప్ వెర్డే ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. తమ తీరానికి దూరంగా సముద్ర జలాల్లో అది నిలిచిఉన్నట్టు పేర్కొంది. నౌకలోని ప్రస్తుత పరిస్థితికి అరుదైన హంటా వైరస్ కారణమని అనుమానిస్తున్నారు. ఇది ఎలుకల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ఒకరినుంచి మరొకరికి సోకే ప్రమాదముందని గతంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే క్రూజ్ షిప్‌లోకి వైరస్ ఎలా వ్యాపించిందనే దానిపై మాత్రం స్పష్టత లేదు. మే 4నాటికి 7 హంటా వైరస్ కేసులు వెలుగులోకి వచ్చాయి. వైద్య పరీక్షల్లో రెండు కేసులు ధ్రువీకరణ అయ్యాయి. ఇప్పటికే ముగ్గురు మరణించగా.. మరొకరిలో తీవ్ర లక్షణాలు కనిపిస్తున్నాయి. మిగతా ముగ్గురిలో లక్షణాలు స్వల్పంగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. నౌకలో 88మంది ప్రయాణికులు, 60మంది సిబ్బంది ఉన్నారు. మృతి చెందిన జర్మన్ జాతీయుడి మృతదేహం ఇప్పటికీ షిప్‌లోనే ఉందని మీడియా కథనాలు వెల్లడించాయి.

## ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్





పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారం ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది. డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మ ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని ప్రకటించారు. ప్రముఖ మీడియా సంస్థ బ్లూమ్స్‌బర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్ కలిసి ఆనంద్, సుపర్ణ ఈ అవార్డును షేర్ చేసుకోనున్నారు.

## అమెరికా 'గ్యాస్ స్టేషన్' అదృశ్యం!

**ఖతార్ గగనతలంలో మిస్సైనట్టు సమాచారం**




గాలిలోనే ఇంధనం నింపగల సామర్థ్యమున్న అమెరికాకు చెందిన విమానం ఒకటి కనిపించకుండా పోయింది. బోయింగ్ కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ అనే ఫ్లయింగ్ గ్యాస్ స్టేషన్‌గా పిలిచే విమానం ఇరాన్ సమీపంలోని పర్షియన్ గల్ఫ్ తీరంలో ప్రయాణిస్తుండగా గల్లంతైంది. గల్లంతు కావడానికి కొద్దిసేపటి ముందు ఎమర్జెన్సీ సిగ్నల్ అందించింది. ఒకపక్క మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ సంక్షోభం నెలకొన్నదృష్ట్యా.. విమానం కనిపించకుండా పోవడం ఆసక్తికరంగా మారింది. ఈ అమెరికా విమానం యూఏఈలోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి బయల్దేరింది. ఖతార్ వద్ద ప్రయాణిస్తున్నప్పుడు సిగ్నల్ కోల్పోయింది. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ సంక్షోభం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గల్ఫ్, ఇరాన్ ప్రాంతంలో మోహరించిన అమెరికా యుద్ధ విమానాలకు ఇంధనం నింపేందుకు ఈ విమానం సాయపడుతోంది. విమానం కనిపించకుండా పోవడానికి లేదా ఎక్కడైనా ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవ్వడానికి ముందు గాలిలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్టు డాటా ద్వారా వెల్లడవుతోంది. ఈ విమానం కనిపించకుండా పోవడానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. దీనిపై అమెరికానుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అలాగే, ఘటనలో తమ ప్రమేయం గురించి ఇరాన్ కూడా ఎలాంటి ప్రకటనా చేయలేదు. అమెరికా మిలిటరీ కూడా దీనిపై స్పందించలేదు. గత మార్చిలో ఇరాన్ జరిపిన దాడుల్లో ఇలాంటి మరో కేసీ-135 విమానాన్ని అమెరికా ఇరాక్ భూభాగంలో కోల్పోయింది. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ఈ దాడి చేశామని ఇరాక్ ప్రకటించింది. ఈ విమానం అమెరికన్ ఆర్మీకి చాలా కీలకమైంది. గాలిలోనే యుద్ధ విమానాల్లో ఇంధనం నింపగలదు. అలాగే, సామగ్రిని, ప్రయాణికుల్ని కూడా మోసుకెళ్లగలదు. ఈ తరహా విమానాలు అమెరికా రక్షణ రంగంలో 60 ఏళ్లుగా సేవలందిస్తున్నాయి.

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. 21మంది దుర్మరణం



చైనాలోని హునాన్ ప్రావిన్సులో ఉన్న బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. సుమారు 21మంది మరణించారు. మరో 61మంది గాయపడ్డారు. హువాషెంగ్ ఫైర్‌వర్క్స్ ప్లాంట్‌లో ఘటన చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం లియుయాంగ్ సిటీలో పేలుడు సంభవించింది. సుమారు 3 కిలోమీటర్ల దూరం వరకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డ వారికి వైద్యం అందించేందుకు సుమారు 500మంది సిబ్బంది రంగంలోకి దిగారు. బిల్డింగ్‌లో ట్రాప్ అయిన వారిని రక్షించేందుకు రోబోలను వాడారు. పేలుడు ఘటనపట్ల పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఫైర్‌వర్క్స్ కంపెనీ ఇంచార్జిని అదుపులోకి తీసుకున్నారు. బాణాసంచా ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న రెండు గన్‌పౌడర్ వేరౌజ్‌ల వల్ల రెస్క్యూ ఆపరేషన్ మరింత ఇబ్బందికరంగా మారింది. పేలుడు తీవ్రత ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న బిల్డింగ్ కిటికీలు ధ్వంసమయ్యాయి. దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్.. సెర్చ్ ఆపరేషన్‌కు ఆదేశించారు. బాధ్యులైన వారిని శిక్షించాలన్నారు.

# టీ20 ర్యాంకింగ్స్ అగ్రస్థానంలోనే భారత్

ఢిల్లీ: టీ20 క్రికెట్ ఫార్మాట్‌లో భారత జట్టు ఆధిపత్యం కొనసాగుతోంది. తాజాగా ఐసీసీ విడుదల చేసిన టీ20 ర్యాంకిం గ్స్ జాబితాలో టీమిండియా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన టీ20 ప్రపంచ కప్‌ను టీమిండియా ముద్దాడిన సంగతి తెలిసిందే. వరుసగా రెండు సార్లు, మొత్తంగా మూడుసార్లు ఈ ట్రోఫీని అందుకున్న తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. ఇప్పుడు ర్యాంకింగ్స్ జాబితాలో 275 రేటింగ్ పాయింట్లతో సత్తా చాటింది. టీమిండియా తర్వాత ఇంగ్లండ్ జట్టు 262 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగు తోంది. ఆస్ట్రేలియా(258), న్యూజిలాండ్(247) పాయింట్లతో మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. అయితే టాప్ 7 జట్లలో ఎలాంటి మార్పులు జరగలేదు. సౌతాఫ్రికా(244), పాకిస్థాన్(240), వెస్టిండీస్(233) పాయింట్లతో తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి. టీ20 ప్రపంచ కప్ 2026లో పేలవ ప్రదర్శన కనబర్చిన శ్రీలంక జట్టు.. ఆరు పాయింట్లు కోల్పోయి 9వ స్థానానికి పడిపోయింది. ఇదిలా ఉంటే, ద్వైపాక్షిక సిరీస్‌ల్లో రాణించిన బంగ్లాదేశ్(225) 8వ స్థానానికి ఎగబాకింది. అఫ్గానిస్తాన్ (220) తన పదో స్థానాన్ని పదిలపర్చుకుంది. టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శనలు చేసి.. ప్రపంచ మేటి జట్లకు గట్టి పోటీనిచ్చిన అమెరికా రెండు స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరుకోవడం విశేషం. నెదర్లాండ్స్, స్కాట్లాండ్ జట్లు వరుసగా 14, 15వ స్థానాల్లో కొనసాగుతున్నాయి.




## 'టెస్టు ప్లేయర్' ముద్ర చెరిపేసుకున్నా: రాహుల్



ఢిల్లీ: ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ అద్భుత ప్రదర్శనలతో అదరగొడుతున్నాడు. ఈ సీజన్‌లో 9 మ్యాచుల్లో 433 పరుగులు చేసి టోర్నీలో సెకండ్ లీడింగ్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. పంజాబ్ కింగ్స్‌పై 67 బంతుల్లో 152 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మొత్తం గా ఈ సీజన్‌లో రెండు హాఫ్ సెంచరీలు, ఒక భారీ శతకంతో కేఎల్ రాహుల్ సత్తాచాటాడు. తాజాగా జియో హాట్‌స్టార్ నిర్వ హించిన 'సూపర్ స్టార్స్' కార్యక్రమంలో రాహుల్ పాల్గొని మాట్లా డాడు. ఒకప్పుడు తనను టీ20 ప్లేయర్‌గానే చూడలేదని, టెస్టు క్రికెటర్‌గా ముద్ర వేశారని పేర్కొన్నాడు. 'పదేళ్ల క్రితం నేను టీ20 జట్టులో భాగం కావడానికి అన్ని విధాలుగా కష్టపడ్డా. నన్ను ఎప్పుడూ ఒక టీ20 ప్లేయర్‌గా పరిగణించ లేదు. కనీసం ఒక మంచి వైట్‌బాల్ క్రికెటర్‌గా కూడా గుర్తించలేదు. కేవలం టెస్టు ఆటగాడిగా ముద్ర వేశారు. దాని నుంచి బయ టకు వచ్చి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నా ఆటను మెరుగు పరుచుకుని ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా గర్వకారణం. ఈ ప్రయాణంలో కొన్ని తప్పులు చేశాను. అలాగే ఇంకా కొన్ని విషయాల్లో మెరుగవ్వాలి. కానీ, నేను గర్వపడే విషయం ఏమి టంటే.. ఆడిన ప్రతి మ్యాచులోనూ నా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాను. టీ20 క్రికెట్ గత మూడేళ్లలో చాలా మారింది. ముఖ్యంగా పవర్ ప్లేలోనే మ్యాచ్ దిశ నిర్ణయమవుతోంది. తొలి ఆరు ఓవర్లలో దూకుడుగా ఆడాలని మా జట్టు మేనేజ్‌మెంట్ స్పష్టంగా చెప్పింది. నేను ప్రస్తుతం అదే పాటిస్తున్నా. అయితే క్రీడల్లో ఎల్లప్పుడూ అన్నీ మనకు అనుకూలంగా జరగవు. దాన్ని తేలికగా తీసుకుని ఈ ప్రయాణాన్ని ఆస్వాదించాలి. నేను గెలిచినా, ఓడినా బ్యాలెన్స్‌డ్‌గా ఉండటానికి ప్రయత్నిస్తా. నేను సాధించని వాటి గురించి నిరాశగా అనిపిస్తే సాధించిన వాటిని గుర్తుచేసు కుంటా. నేను మరికొంత కాలం ఆడగలను. కాబట్టి అత్యుత్తమం గా ఆడేందుకు ప్రయత్నిస్తా. ఎన్ని ట్రోఫీలు గెలవగలనో చూస్తాను' అని కేఎల్ రాహుల్ వివరించాడు.

## ముఖేష్ డబుల్ ధమాకా




హైదరాబాద్: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముఖేష్ రెండు స్వర్ణాలు కొల్లగొట్టాడు. సోమవారం జరిగిన 25 మీటర్ల జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ ముఖేష్ చాంపియన్‌గా నిలిచాడు. న్యూఢిల్లీలోని కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఈ పోటీల్లో 25 మీ., పిస్టల్ ఈవెంట్ రెండు విభాగాల్లోనూ ముఖేష్ 584/600 స్కోరు సాధించి, అగ్రస్థానంలో నిలిచాడు. రెండు విభాగాల్లోనూ సూరజ్ శర్మ (మధ్యప్రదేశ్) రజతం, శ్రవణ్ శశిధర్ (కర్ణాటక) కాంస్యం దక్కించుకున్నారు.

## మళ్లీ ఎమ్మెల్యేగా టీమిండియా మాజీ క్రికెటర్






పశ్చిమబెంగాల్: బెంగాల్‌ను 15 ఏళ్లు పాలించిన మమతా బెనర్జీకి 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో గట్టి షాక్ తగిలింది. భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించి.. దీదీ పాలనకు చరమగీతం పాడింది. అయితే బీజేపీ నుంచి ఎన్నికైన 200 మంది పైచిలుకు ఎమ్మెల్యేల్లో టీమిండియా మాజీ క్రికెటర్ అశోక్ దిండా కూడా ఒకరు. పూర్వ మిడ్నాపూర్ ప్రాంతంలోని మొయ్నా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అశోక్ దిండా బీజేపీ ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికయ్యారు. అశోక్ దిండా.. తన సమీప ప్రత్యర్థి, టీఎంసీ అభ్యర్థి చందన్ మొండల్‌పై 14 వేలకు పైగా ఓట్ల తేడాతో గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో(2021) స్వల్ప తేడాతో విజయం సాధించిన దిండా.. ఈ సారి మంచి మెజారిటీతో గెలుపొందారు. 2021లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశోక్.. అదే ఏడాదిలో బీజేపీలో చేరి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇప్పుడు వరుసగా రెండోసారి విజయం సాధించడంతో.. బెంగాల్‌లో ఏర్పా టయ్యే బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా నియమితుడయ్యే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, 42 ఏళ్ల అశోక్ దిండా.. 2009లో టీమిండియాలోకి అరంగేట్రం చేశారు. తన క్రికెట్ కెరీర్‌లో 13 వన్డేలు, 9 టీ20లు ఆడి 29 వికెట్లు తీశారు. కుడిచేతి మీడియం పేసర్ అయిన అశోక్ దిండా.. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చి భారత జట్టులో అవకాశాలు దక్కించుకున్నారు. ఐపీఎల్‌లో చాలాకాలం కేకేఆర్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఐపీఎల్ కెరీర్‌లో 78 మ్యాచులు ఆడి 69 వికెట్లు పడగొట్టారు. 2010లో ఆసియా కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నా రు. దేశవాళీ క్రికెట్‌లోనూ దిండా అద్భుత ప్రదర్శనలు చేశారు. బెంగాల్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 420 వికెట్లు, లిస్ట్ ఏ క్రికెట్‌లో 151 వికెట్లు పడగొట్టారు.

## జింబాబ్వేపై పాకిస్థాన్ విజయం

పాకిస్తాన్: జింబాబ్వే మహిళల క్రికెట్ జట్టు తొలిసారి పాకిస్తాన్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు పసికూన జింబాబ్వేపై ప్రతాపం చూపింది. 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా కరాచీ వేదికగా నిన్న సోమవారం జరిగిన మ్యాచ్‌లో పాక్ 168 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 330 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ సదాఫ్ షమాస్ (98) తృటిలో శతకం చేజారగా... మరో ఓపెనర్ గుల్ ఫిరోజా (50), వన్‌డౌన్ బ్యాట ర్ సిద్రా అమీన్ (67) అర్ధ సెంచరీలతో రాణించారు. అలానే మిడిలార్డర్ బ్యాటర్ నజిహా అల్వి (56 నాటౌట్) దూకుడుగా ఆడింది. మిగతా బ్యాటర్లలో అయేషా జాఫర్ 3, ఆలియా రియాజ్ 2, కెప్టెన్ ఫాతిమా సనా 11 (నాటౌట్) పరుగులు చేశారు. జింబాబ్వే బౌలర్లలో ప్రెసియస్ మరంగే 3 వికెట్లు తీయగా.. కుద్జాయ్ చిగోరా, కెప్టెన్ నోమ్వేలో సిబంద తలో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే చేతులెత్తేసింది. బిలవ్ద్ బిజా (53) మినహా ఎవరూ రాణించ లేకపోయారు. ఓపెనర్ కెలిస్ (31)కాసేపు పోరాడిం ది. మిగతా ప్లేయర్లలో కెల్లీ (11), మెలిండ (10), సిబంద (17) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. పాక్ బౌలర్లలో ఫాతిమా సనా, తస్మియా రుబాబ్, సయ్యదా ఆరూబ్ షా తలో 2 వికెట్లు పడగొట్టాడు. మొమినా రియాసత్, నష్రా సంధు చెరో వికెట్ దక్కించుకున్నారు. ఈ సిరీస్‌లోని రెండో వన్డే ఇదే కరాచీ వేదికగా మే 6న(బుధవారం) జరుగనుంది.



## లఖ్‌నవూపై ముంబై ఘన విజయం



ముంబై: ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపుగా మూసుకుపోయిన వేళ.. మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ అదరగొట్టింది. వెటరన్ ఓపెనర్ రోహిత్ శర్మ (44 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్ల తో 84) చాలారోజుల తర్వాత బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టు కున్నాడు. అతడికి రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 83) సహకరించడంతో సోమవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ముంబై నెగ్గింది. పది మ్యాచ్‌ల్లో ఈ జట్టుకిది కేవలం మూడో విజయం. అలాగే మిగిలిన నాలుగు మ్యాచ్‌లనూ గెలిచి మిగతా టీమ్స్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అటు కేవలం 4 పాయింట్లతో ఉన్న లఖ్‌నవూకు ఇది వరుసగా ఆరో ఓటమి. దీంతో ఈ జట్టు కూడా దాదాపుగా నిష్క్రమించినట్టే. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (21 బంతుల్లో 1 ఫోర్, 8 సిక్సర్లతో 63), మార్ష్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 44), హిమ్మత్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 40 నాటౌట్), మార్క్‌రమ్ (25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 31 నాటౌట్) రాణించారు. బాష్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసి గెలిచిం ది. సిద్ధార్థ్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రికెల్టన్ నిలిచాడు.

## ఐపీఎల్‌లో తొలి వికెట్.. 'జై శ్రీరామ్' నోట్‌తో సంబరాలు



ముంబై: ఐపీఎల్ 2026లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై ముంబై ఇండియన్స్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఒక భావోద్వేగపూరితమైన సన్నివేశం చోటుచేసుకుంది. ముంబై ఇండియన్స్ లెగ్ స్పిన్నర్ రఘు శర్మ.. ఈ మ్యాచ్‌లో తొలి ఐపీఎల్ వికెట్ అందుకున్నాడు. ఈ వికెట్ తీసిన వెంటనే ఒక నోట్ తీసి ప్రేక్షకులవైపు చూపిస్తూ ఎమోషనలయ్యాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో తొలి బంతికి ఆక్షత్ రఘువంశీ (11)ని రఘు శర్మ క్యాచ్ ఔట్ చేశాడు. దీంతో తన 15 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికాడు. తొలి వికెట్ తీయడంతో రఘు శర్మ సంతోషానికి హద్దే లేకుండాపోయింది. ముందే ఒక నోట్ రాసిపెట్టుకుని జేబులో తెచ్చుకున్న రఘు శర్మ.. వికెట్ తీసిన వెంటనే ప్రేక్షకుల వైపు చూపిస్తూ సంబరం చేసుకు న్నాడు. 'రాధే రాధే.. గురుదేవుల కృపతో నా 15 ఏళ్ల బాధాక రమైన నిరీక్షణ ముగిసింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన ముంబై ఇండియన్స్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. జై శ్రీరామ్' అని నోట్ లో రాసి ఉంది. దీంతో నెటిజన్లు ఫిదా అవుతున్నారు. తన లక్ష్యం కోసం 15 ఏళ్లుగా కష్టపడుతున్న అతని పట్టుదలను ప్రశంసిస్తున్నారు.

చైతన్య రథం సినిమా
బుధవారం 6 మే 2026


# కల్కి షూట్‌కు సడెన్ బ్రేక్?



ప్రస్తుతం పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న పలు అవైటెడ్ బిగ్గెస్ట్ సీక్వెల్ చిత్రాల్లో దర్శకుడు నాగ్ అశ్విన్‌తో చేస్తున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ కల్కి పార్ట్-2 కూడా ఒకటి. ఎప్పుడు నుంచో అభిమానులు, న్యూట్రల్ ఆడియెన్స్ ఆసక్తిగా సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఫైనల్‌గా సినిమా షూట్ మొదలైంది. అమితాబ్, కమల్ కూడా జాయినయ్యారు. ఇక ప్రభాస్, సాయిపల్లవి కూడా జాయిన్ అయినట్లేననే సమయంలో సినిమాకి బ్రేక్ పడినట్టు తెలుస్తుంది. ప్రస్తుతం సాయిపల్లవికి కొంచెం ఆరోగ్యం బాగోని కారణంగా ఈ డిలే నెలకొందని అంటున్నారు. అయితే మరి ఈ షూట్ కొన్ని రోజులు వెనక్కి వెళ్లినట్టు తెలుస్తుంది. మే మధ్యనుంచి మళ్ళీ సినిమా స్టార్ట్ అవుతుందని టాక్. అప్పటినుంచి దాదాపు అందరు స్టార్స్ అందుబాటులో ఉంటారట. సో దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

# ఓటీటీకి పాపం ప్రతాప్




నటన, సినిమాల ఎంపికతో మంచి పేరు తెచ్చుకున్న యంగ్ హీరో తిరువీర్ నటించిన లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ సినిమానే 'పాపం ప్రతాప్'. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్. దర్శకుడు ఎస్‌పీ దుర్గానగేష్ తెరకెక్కించిన విలేజ్ డ్రామా ఇది. గత ఏప్రిల్ 17న థియేటర్స్‌లో విడుదలైన సినిమా మంచి ప్రమోషన్స్ నడుమ వచ్చింది. అయితే చిత్రం అనుకున్న రేంజ్ సక్సెస్‌ని మాత్రం కొట్టలేదు. తిరువీర్ గత చిత్రం 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' కంటే తక్కువే పెర్ఫామ్ చేసింది. ఇక ఫైనల్‌గా థియేటర్స్ నుంచి ఇపుడు ఓటిటి రిలీజ్‌కి డేట్‌ని ఫిక్స్ చేసుకుంది. ఈటీవీ విన్‌లో మే 7నుంచి సినిమా స్ట్రీమింగ్ కానున్నట్టు ఖరారు చేశారు. సో అప్పుడు మిస్సైన వారు ఇపుడు చూడొచ్చు. ఇక ఈ చిత్రానికి కేఎమ్ రాధాకృష్ణన్ సంగీతం అందించగా.. మిత్రవింద సినిమాస్ నిర్మాణం వహించారు.

# మీనుంచి అవార్డు తీసుకుంటా..

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ప్రముఖ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సినీ, రాజకీయ రంగ ప్రముఖులెందరో ఇప్పటికే ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో.. విజయ్‌నుంచి అవార్డు అందుకోవాలనుందన్న విషయాన్ని ప్రస్తావిస్తూ దర్శక, నటుడు ఎస్‌జే సూర్య పోస్టు పెట్టడం ఆసక్తికరం. "ఉత్తమ నటుడిగా తమిళనాడు ప్రభుత్వ పురస్కారాన్ని మీ చేతుల మీదుగా అందుకోవాలని 'వారిసు' షూటింగ్ సమయంలో మీకు చెప్పాను. నా స్టేట్‌మెంట్ సగం నిజమైంది. మీనుంచి అవార్డు తీసుకునేందుకు నేను ఇంకా కష్టపడాలి. గొప్ప విజయాన్ని సాధించినందుకు కంగ్రాట్స్ విజయ్ సర్. నేను ఇప్పుడు చాలా ఖుషీగా ఉన్నాను" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. విజయ్ హీరోగా సూర్య తెరకెక్కించిన 'ఖుషి' (2000) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత, విజయ్ సినిమాలు 'మెర్సల్', 'వారిసు' తదితర వాటిలో సూర్య నటించడం విశేషం.



## కొత్త అధ్యాయమన్న రిషబ్‌శెట్టి


కన్నడ నటుడు రిషబ్ శెట్టి విజయ్‌కి కంగ్రాట్స్ చెబుతూ పోస్టు పెట్టారు. "తమిళనాడు పొలిటికల్ హిస్టరీలో కొత్త చాప్టర్ రాసినందుకు హృదయపూర్వక అభినందలు విజయ్. మీ నాయకత్వంలో రాష్ట్రం మరింత ప్రగతి సాధించాలని ఆశిస్తున్నా. మీ విజయం యువతకు స్ఫూర్తి" అని పేర్కొన్నారు.

# నిర్మాత ఆర్బీ చౌదరి దుర్మరణం

ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి (83) దుర్మరణం చెందారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తమిళ, తెలుగు, మలయాళంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. పలు సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేశారు. 'రంగం' ఫేమ్ హీరో జీవా.. ఆర్బీ చౌదరి తనయుడే. ఆయనకు మరో ముగ్గురు కుమారులున్నారు.

## పేరుకు తగ్గట్టే 'గుడ్'ఫిల్మ్స్

రాజస్థానీ అయిన ఆర్‌బీ చౌదరి పూర్తి పేరు రతన్‌లాల్ భగత్‌రామ్ చౌదరి. సినిమాల్లోకి రాకముందు స్టీల్, జ్యూవెల్లరీ తదితర వ్యాపారాలు నిర్వహించారు. ఆయన నిర్మించిన తొలి సినిమా 'ఆదిపాపమ్' (మలయాళం). 1988లో విడుదలైంది. 1990లో 'పుదు వసంతం'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 1994లో విడుదలైన 'కెప్టెన్' ఆర్బీ చౌదరి నిర్మించిన తొలి తెలుగు సినిమా. 'సుస్వాగతం'తో ఘన విజయాన్ని అందుకున్నారు. అది మొదలు 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'నువ్వు వస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'ప్రియమైన నీకు', 'శివరామరాజు', 'గోరింటాకు', 'సంక్రాంతి'.. ఇలా కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. సూపర్ గుడ్ ప్రొడక్షన్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్ గుడ్‌ఫిల్మ్స్ బ్యానర్ల పేర్లు మారినా ఆయన సినిమాల్లోని వినోదం మాత్రం తగ్గలేదు. ఇండస్ట్రీలోకి వచ్చి 38 ఏళ్లయినా యాక్టివ్ ప్రొడ్యూసర్స్ జాబితాలో ఉన్నారు. ఆయన నిర్మాణంలో గతేడాది 99వ సినిమా 'మకుటం' మొదలైంది. ఇందులో విశాల్ హీరో.



# విశ్వంభర.. మ్యూజిక్ ట్విస్ట్?

చిరంజీవి నటిస్తున్న తాజా సోషియో-ఫాంటసీ విశ్వంభరపై అంచనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో భారీవిజయాన్ని అందుకున్న చిరంజీవి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బింబిసార'తో సక్సెస్ అందుకున్న దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. పురాణాల నేపథ్యంలో 14 లోకాల కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది. లోకాలను కాపాడే రక్షకుడిగా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం.



ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న సినిమా మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం, నేపథ్య సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు హరి గౌరకు అప్పగించినట్టు తెలుస్తోంది. పాటల కంపోజిషన్‌ను కీరవాణి చూసుకుంటుండగా,భారీ యాక్షన్ సన్నివేశాలు, ఫాంటసీ ఎలిమెంట్స్‌కు పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే బాధ్యతను హరి గౌర తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన తన పనిని ప్రారంభించారని సినీ వర్గాలు చెబుతున్నాయి. హరి గౌర గతంలో చేసిన ప్రాజెక్టులు ఆయన ప్రతిభను నిరూపించాయి. ముఖ్యంగా హనుమాన్ చిత్రానికి అందించిన సంగీతం మంచి ప్రశంసలు అందుకుంది. అలాగే 'మిరాయ్'వంటి సినిమాలకు ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెలోడీస్‌తో పాటు గూస్‌బమ్స్ తెప్పించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇవ్వడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో 'విశ్వంభర'లో హరిగౌర ఎంట్రీ సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా మారనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ విజువల్స్‌తో వస్తున్న చిత్రానికి ఆయన ఇచ్చే నేపథ్య సంగీతం ఏస్థాయిలో ఉంటుందో చూడాలని మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అదరగొట్టిన ది ఒడిస్సీ ట్రైలర్

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ది ఒడిస్సీ'కి సంబంధించిన కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. యూనివర్సల్ పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రం జూలై 17న థియేటర్లలోకి రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేయగా.. ట్రైలర్‌లో గ్రీకువీరుడు ఒడిస్సియస్, ట్రోజన్ యుద్ధం ముగిసిన తర్వాత తన భార్య, కొడుకును రక్షించుకోవడానికి రాజ్యమైన ఇథాకాకు తిరిగి వచ్చే క్రమంలో ఎదుర్కొనే సుదీర్ఘమైన, ప్రమాదకరమైన ప్రయాణమే సినిమా కథ. ఇందులో ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటిస్తుండగా, అతని కుమారుడు టెలిమాకస్‌గా టామ్ హాలండ్, భార్య పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపించనున్నారు. అలాగే నింఫ్ కాలిప్సోగా చార్లీజ్ థెరాన్, పెనెలోప్‌ను వివాహం చేసుకుని రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని చూసే విలన్ ఆంటినస్ పాత్రలో రాబర్ట్ ప్యాటిన్సన్ నటిస్తున్నారు. హోమర్ రాసిన పురాణ గాథ 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందుతున్న సినిమాలో సైక్లోప్స్‌వంటి పురాణ జీవులను నోలన్ తనదైన శైలిలో అద్భుతంగా చూపించబోతున్నట్టు తెలుస్తుంది. పూర్తిస్థాయి ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన సినిమాలోని యుద్ధ సన్నివేశాలు వెండితెరపై ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సుమారు 250 మిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న చిత్రం నోలన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాగా నిలవనుంది.

